రూ.1 సిమ్‌తో
బీఎస్ఎన్ఎల్ బంపరాఫర్



7

వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

పెరగనున్న సబ్బులు,
వంటనూనెల ధరలు



7

Published From : Rangareddy VOLUME : 01 Issue : 308 Monday 26-10-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

శతకాల సునామీ.. సిరీస్ మనదే!

- రెండో వన్డేలో జింబాబ్వేపై భారత్ ఘన విజయం
- హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మ సెంచరీలతో పరుగుల వరద
- 121 పరుగుల తేడాతో ప్రత్యర్థిని చిత్తుచేసిన టీమిండియా
- 328 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత మహిళలు
- వైష్ణవికి నాలుగు, దీప్తికి మూడు వికెట్లు
- మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2--0తో సిరీస్ కైవసం
- 28న నామమాత్రపు చివరి వన్డే



02

ఫ్రాన్స్‌లో భగ్గుమన్న నిరసనలు..

- జీవన వ్యయం, నిరుద్యోగంపై ప్రజల ఆగ్రహం
- దేశవ్యాప్తంగా పలు నగరాలకు విస్తరించిన ఆందోళనలు
- పోలీసులు--నిరసనకారుల మధ్య తీవ్ర ఘర్షణలు
- దుకాణాల దహనం.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల ధ్వంసం
- టియర్ గ్యాస్, వాటర్ కెనాన్లతో నిరసనకారుల చెదరగొట్టివేత
- లియోన్, లిల్లె, మార్సెల్లి సహా పలు నగరాల్లో ఉద్రిక్తత



02

తుమ్మిడిహెట్టిపై నేడే తాడోపేడో!

నేడు మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో రేవంత్‌రెడ్డి కీలక భేటీ

- 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి తెలంగాణ పట్టు
- సమగ్ర నివేదికతో మహారాష్ట్రను ఒప్పించేందుకు సర్కార్ ప్రయత్నం
- 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే 165 టీఎంసీల నీటి లభ్యత
- 148 మీటర్లకు పరిమితమైతే 55 టీఎంసీలకే అవకాశం
- 2,300 ఎకరాల ముంపు భూముల పరిహారానికి తెలంగాణ సుముఖం
- ఐదు ప్రత్యామ్నాయాలతో రూ.12 వేల కోట్ల ప్రాజెక్టు ప్రణాళిక
- ముంబయి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్

రెండు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు భవితవ్యంపై నేడు కీలక చర్చలు జరగనున్నాయి. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ప్రధాన అడ్డంకిగా మారిన బ్యారేజీ ఎత్తు వివాదానికి పరిష్కారం కనుగొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. సోమవారం ముంబయిలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమై 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి అంగీకారం సాధించేందుకు ప్రయత్నించనున్నారు. ఈ ఎత్తులో నిల్చిస్తే 165 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశముండగా, 148 మీటర్లకు పరిమితమైతే 55 టీఎంసీలే అందుబాటులో ఉంటాయని తెలంగాణ నీటిపారుదల శాఖ అంచనా వేస్తోంది. మహారాష్ట్ర పరిధిలో ముంపునకు గురయ్యే 2,300 ఎకరాల భూముల పరిహారంలో తన వాటా చెల్లించేందుకు సిద్ధమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేయనుంది. ఐదు ప్రత్యామ్నాయాలు, రూ.12 వేల కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర ప్రణాళికను మహారాష్ట్ర ముందుంచనుంది.

హైదరాబాద్,

రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంపై నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడే కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ప్రధాన అడ్డంకిగా మారిన బ్యారేజీ ఎత్తు వివాదాన్ని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ప్రయత్నాలు ప్రారంభించారు. సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ముంబయిలో సమావేశమై ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర అంగీకారం సాధించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేసింది. ముంపు భూములకు సంబంధించిన పరిహారంలో వాటా -మిగతా 2 లో







ఎన్ని దాడులు చేసినా
మా వైఖరి మారదు!

- అమెరికాకు ఇరాన్ మరోసారి స్పష్టమైన హెచ్చరిక
- మళ్లీ సైనిక చర్యకు దిగినా వెనక్కి తగ్గబోమన్న అరాగ్చీ
- మరోసారి దాడులు తప్పవన్న ట్రంప్ వ్యాఖ్యలపై స్పందన
- హార్ముజ్ జలసంధిలో పాత పరిస్థితులు రావన్న ఇరాన్
- కాల్పుల విరమణతోనే సరిపెట్టకుండా యుద్ధం పూర్తిగా ముగియాలి
- అమెరికా యుద్ధ విమానాలను ధ్వంసం చేశామంటూ ఇరాన్ విదేశాంగ మంత్రి ప్రకటన



మా ర్యాలీకి పబ్లిసిటీ చేస్తున్నందుకు థ్యాంక్స్'..

- బీజేపీపై రాహుల్‌గాంధీ వ్యంగ్యాస్త్రాలు..!
- నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన ర్యాలీ
- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో రామ్‌లీలా మైదానం వరకు ప్రదర్శన
- ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలకు కృతజ్ఞతలంటూ రాహుల్ వ్యంగ్యం
- ఓటర్ల జాబితా నుంచి కోట్లాది పేర్ల తొలగింపుపై తీవ్ర ఆరోపణలు
- మూడు రోజులపాటు ఢిల్లీలోనే ఉండాలని కాంగ్రెస్ ఎంపీలకు ఆదేశాలు
- 10 లక్షల మంది హాజరవుతారన్న కాంగ్రెస్ నేతలు.. భద్రత కట్టుబిట్టం



తెలుగు రాష్ట్రాలపై తుఫాన్ ముప్పు!

- బంగాళాఖాతంలో బలపడుతున్న వాయుగుండం
- నేడు తుఫాన్‌గా.. 27న తీవ్ర తుఫాన్‌గా మారే అవకాశం
- 28న బాపట్ల--విశాఖ మధ్య తీరం దాటవచ్చని అంచనా
- తీరం దాటే సమయంలో గంటకు 115--125 కి.మీ. వేగంతో గాలులు
- గరిష్ఠంగా 140 కి.మీ. వేగంతో ఈదురుగాలుల ముప్పు
- 27 నుంచి ఏపీలో భారీ వర్షాలు కురిసే సూచనలు
- తెలంగాణలో ఉరుములు, మెరుపులతో వర్షాలకు అవకాశం
- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

తెలంగాణ బ్యూరో ప్రతినిధి:
బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తెలుగు రాష్ట్రాలను కలవరపెడుతోంది. వాయుగుండం క్రమంగా బలపడి తుఫాన్‌గా మారే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరికలు వెలువడుతున్నాయి. తెలంగాణలోనూ పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.వాతావరణ అంచనాల ప్రకారం బంగాళాఖాతంలోని వాయుగుండం అక్టోబర్ 26 నాటికి తుఫాన్‌గా, -మిగతా 2 లో

రాజకీయాల్లోకి ధనుష్?

- చెన్నైలో మహిళా అభిమాన సంఘాలతో ప్రత్యేక సమావేశం
- 58 జిల్లాల నుంచి హాజరైన మహిళా ప్రతినిధులు
- సమావేశంలో పాల్గొన్న సుమారు 3 వేల మంది అభిమానులు
- రాజకీయ ప్రవేశంపై తమిళనాట ఆసక్తికర చర్చ

తమిళ సినీ నటుడు ధనుష్ రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారంటూ ప్రచారం జోరందుకుంది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో పలువురు ప్రముఖులతో చర్చలు జరిపినట్లు వార్తలు రావడం, అనంతరం పెద్ద సంఖ్యలో మహిళా అభిమాన సంఘాల ప్రతినిధులతో సమావేశమైనట్లు కథనాలు వెలువడటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అభిమాన సంఘాలను బలోపేతం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ సమావేశాలు నిర్వహించారా? లేక రాజకీయ ప్రవేశానికి ముందస్తు సన్నాహాలా? అన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. అయితే రాజకీయ అరంగేట్రంపై ధనుష్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఆయన సమావేశాలు, రాజకీయ ప్రవేశానికి సంబంధించిన ప్రచారంపై స్వతంత్ర ధ్రువీకరణ కూడా లభించలేదు.





2028లో మళ్లీ కేసీఆరే సీఎం..

- తెలంగాణను తిరిగి నంబర్ వన్‌గా నిలబెడతాం... కేటీఆర్
- కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపై నిలదీత
- రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్న
- మైనారిటీ సంక్షేమానికి రూ.4 వేల కోట్ల కేటాయింపు ఎక్కడని విమర్శ
- పింఛన్ల పెంపు, రైతు భరోసా అమలుపై ప్రభుత్వానికి ప్రశ్నలు
- తెలంగాణను రాహుల్ గాంధీకి ఏటీఎంగా మార్చారని ఆరోపణ
- భూముల వ్యవహారాలు, వ్యాపార ఒప్పందాలపై విచారణకు డిమాండ్
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరిన జిబ్రాన్ షరీఫ్

హైదరాబాద్,

2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, తెలంగాణను తిరిగి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ రాహుల్ గాంధీకి ఏటీఎంగా మారిందని ఆరోపించారు. -మిగతా 2 లో



భారత బలగాలకు అసాధ్యమైన
లక్ష్యమంటూ ఏదీ లేదు!

- ఆపరేషన్ సింధూర్‌తో భారత సైనిక శక్తి నిరూపితమైంది
- పాక్‌లోని ఉగ్రస్థావరాలపై కచ్చితమైన దాడులు చేశాం
- స్వదేశీ ఆయుధాల సత్తాను ప్రపంచానికి చాటిచెప్పాం
- అధునాతన క్షిపణి వ్యవస్థలతో మరింత బలోపేతమైన రక్షణ
- దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి స్వదేశీ తయారీ కీలకం
- ఇండో-పసిఫిక్ పరిణామాలపై వైమానిక దళం నిరంతర నిఘా
- క్వాడ్ దేశాలతో రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేస్తాం
- పీటీఐ ఇంటర్వ్యూలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వ్యాఖ్యలు

రెండో పంట వేయొద్దు!

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర నీటి కొరత ముప్పు

- తొలి పంటను కాపాడేందుకు ఎంత ఖర్చుకైనా ప్రభుత్వం సిద్ధం
- సాగునీరు, విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు
- నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచన
- సంక్షోభంపై త్వరలో అఖిలపక్ష సమావేశం
- తెలంగాణకు కేంద్రం వివక్ష లేకుండా సహకరించాలని విజ్ఞప్తి
- ఖమ్మంలో రూ.39 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

ఖమ్మం,

రానున్న రోజుల్లో సూపర్ ఎల్నినో ప్రభావంతో నీటి లభ్యపై అనిశ్చితి ఏర్పడే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ పరిస్థితులు తెలంగాణకే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఖమ్మం జిల్లా ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ. 38 కోట్ల వ్యయంతో మద్దులపల్లి నుంచి గొల్లగూడెం రోడ్డు వరకు -మిగతా 2 లో



వార్తసంధ్య
www.vaarthasandhya.com

ఫ్రాన్స్‌లో భగ్గుమన్న నిరసనలు..




న్యూఢిల్లీ
ఫ్రాన్స్‌లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి. మొదట ఫ్రాన్స్ వరకే పరిమితమైన ఆందోళనలు ఇప్పుడు అనేక పట్టణాలకు విస్తరించాయి. ప్రజలు, యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలపడంతో ఆందోళన ఉధృతంగా కొనసాగుతోంది. జీవన వ్యయం పెరగడం, నిత్యవసరాల సరుకులు అందుబాటులో లేకపోవడం, నిరుద్యోగం వంటి సమస్యల్ని నిరసిస్తూ ఫ్రాన్స్‌లో ప్రజలు ఆందోళనబాట పట్టారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు 1,000 మందిని అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఫ్రాన్స్ రక్షణ శాఖ మంత్రి లారెంట్ నునెజ్ వెల్లడించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 4,10,000 మంది ఆందోళనల్లో పాల్గొన్నారు. అయితే, నిర్వాహకులు మాత్రం 8,00,000 మంది ఆందోళనల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న ఈ ఆందోళనల్లో కొందరు నిరసనకారులు షాపులు దహనం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారు. షాపుల్ని లూటీ చేస్తున్నారు. దీంతో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. కోర్స్ డి విన్సెన్నెస్ ప్రాంతంలో ఆందోళనకారుల్ని చెదరగొట్టారు. ఈ ప్రాంతంలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. ఆందోళనకారుల్ని అదుపు చేసేందుకు హెలికాప్టర్లను కూడా వాడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆందోళనల్ని అదుపు చేయడానికి వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్, గ్రెనడ్లు వంటివి వాడుతున్నట్లు వివరించారు. శాంతి భద్రతల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. లియోన్, లిల్లె, మార్సెల్లి సహా ఇతర పట్టణాల్లోనూ ఆందోళనలు జరిగాయి.

తెలుగు రాష్ట్రాలపై తుఫాన్ ముప్పు!

మొదటి తరువాయి

27 నాటికి తీవ్ర తుఫాన్‌గా బలపడే అవకాశముంది. అక్టోబర్ 28న ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల--విశాఖపట్నం మధ్య తీరం దాటవచ్చని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముండగా, గరిష్టంగా 140 కిలోమీటర్ల వేగాన్ని అందుకునే ప్రమాదముందని పేర్కొంటున్నారు. అయితే తుఫాన్ ప్రయాణించే దిశ, తీవ్రతలో మార్పులు చోటుచేసుకునే అవకాశముంది. తుఫాన్ ప్రభావంతో అక్టోబర్ 27 నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ముఖ్యంగా తీరప్రాంతాల్లో బలమైన గాలులు, ఎడతెరిపి లేని వర్షాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదముంది. సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అధికారుల హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు. తెలంగాణలోనూ తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశముంది. అక్టోబర్ 25, 26 తేదీల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, 27న తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు వాతావరణ అంచనాలు వెల్లడిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది. తుఫాన్ తీవ్రత, దిశకు సంబంధించి అంచనాలు మారే అవకాశం ఉన్నందున ప్రజలు తాజా వాతావరణ హెచ్చరికలను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా తీరప్రాంత ప్రజలు, రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు.

రాజకీయాల్లోకి ధనుష్?



చెన్నై:
తమిళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు ధనుష్ రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారనే ప్రచారం ఆసక్తి రేపుతోంది. ఇటీవల ఢిల్లీలో పలువురు కీలక వ్యక్తులతో సమావేశమైనట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలో తాజాగా చెన్నైలో మహిళా అభిమాన సంఘాల ప్రతినిధులతో ఆయన భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలతో ధనుష్ రాజకీయ ప్రవేశానికి సన్నాహాలు చేస్తున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చెన్నై నగరంలోని చోళింగనల్లూరు ప్రాంతంలో ఉన్న జెప్పియార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం మహిళా అభిమాన సంఘాల సమావేశం నిర్వహించినట్లు సమాచారం. తమిళనాడులోని 58 జిల్లాల నుంచి మహిళా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరైనట్లు కథనాలు పేర్కొన్నాయి. సుమారు మూడు వేల మంది మహిళా అభిమానులు పాల్గొన్న ఈ సమావేశం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగినట్లు తెలుస్తోంది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ధనుష్ పలువురు ప్రముఖులతో చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ తర్వాత పెద్ద సంఖ్యలో మహిళా అభిమాన సంఘాల ప్రతినిధులతో సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. అభిమాన సంఘాలను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించారా, లేక రాజకీయ ప్రవేశానికి ముందస్తు సన్నాహాలా అన్న అంశంపై ఆసక్తి నెలకొంది.అయితే రాజకీయాల్లోకి ప్రవేశించే విషయమై ధనుష్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. మహిళా అభిమానులతో సమావేశం జరిగినట్లు వచ్చిన కథనాలు, రాజకీయ ప్రవేశానికి సంబంధించిన ప్రచారాన్ని స్వతంత్రంగా ధ్రువీకరించాల్సి ఉంది.

ఎన్ని దాడులు చేసినా మా వైఖరి మారదు!



టెహ్రాన్:
అమెరికా మరోసారి సైనిక దాడులకు దిగినా తమ దేశ విధానాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని ఇరాన్ స్పష్టం చేసింది. ఎన్ని దాడులు జరిగినా తమ వైఖరి మార్చుకునే ప్రసక్తే లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చిచెప్పారు. ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య చేపట్టే అవకాశం ఉందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన స్పందించారు. యుద్ధం జరిగినా, జరగకపోయినా తమ దేశ విధానాలు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో మరోసారి యుద్ధం ప్రారంభమయ్యే అవకాశాలపై చర్చ జరుగుతోందని అరాగ్చీ తెలిపారు. అమెరికా మరోసారి దాడులకు సిద్ధమవుతోందనే ప్రచారం నేపథ్యంలో తమ వైఖరిని స్పష్టం చేస్తున్నామని చెప్పారు. అమెరికా హేతుబద్ధంగా ఆలోచిస్తే ఇరాన్‌పై మరోసారి యుద్ధానికి దిగబోదని వ్యాఖ్యానించారు. సైనిక చర్యలతో తమ దేశాన్ని లొంగదీసుకోవడం సాధ్యం కాదని పేర్కొన్నారు. హార్ముజ్ జలసంధిలో పరిస్థితులు గతంలో మాదిరిగా ఉండబోవని అరాగ్చీ వెల్లడించారు. యుద్ధానికి ముందు ఉన్న స్థితికి జలసంధి తిరిగి వెళ్లే అవకాశం లేదన్నారు. గత ఘర్షణలు ప్రాంతీయ భద్రతా వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపాయని పేర్కొన్నారు. తాము 'రమదాన్ యుద్ధం'గా పేర్కొంటున్న ఈ ఘర్షణ పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితులను పూర్తిగా మార్చివేసిందని అభిప్రాయపడ్డారు. కేవలం కాల్పుల విరమణతో సమస్యకు పరిష్కారం లభించదని, అన్ని రంగాల్లో యుద్ధం పూర్తిగా ముగిసేలా చర్యలు ఉండాలని అరాగ్చీ డిమాండ్ చేశారు. తాత్కాలికంగా దాడులను నిలిపివేయడం కాకుండా భవిష్యత్తులో మరోసారి ఘర్షణలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం అవసరమని పేర్కొన్నారు. గత యుద్ధంలో అమెరికాకు చెందిన 80 యుద్ధ విమానాలను క్షిపణులతో కూల్చివేశామని అరాగ్చీ ప్రకటించారు. ఈ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలకు భారీ నష్టం కలిగించామని, వందలాది భవనాలను ధ్వంసం చేశామని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ సైనిక నష్టాలకు సంబంధించి ఇరాన్ చేసిన ప్రకటనలకు స్వతంత్ర ధ్రువీకరణ లేదు. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అరాగ్చీ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

శతకాల సునామీ.. సిరీస్ మనదే!



వడోదర, స్పోర్ట్స్ డెస్క్: భారత మహిళల క్రికెట్ జట్టు సొంతగడ్డపై మరోసారి విజయదుందుభి మోగించింది. జింబాబ్వేతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సొంతం చేసుకుంది. ఆదివారం వడోదర వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత బ్యాటర్లు శతకాలతో చెలరేగగా, బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థిని కట్టడి చేశారు. హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ సెంచరీలతో పరుగుల వరద పారించడంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం 329 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 48.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్ 121 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌లో 2--0 ఆధిక్యాన్ని అందుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే స్మృతి మంధాన పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరిగింది. మూడో ఓవర్‌లో షఫాలీ వర్మ కూడా ఎనిమిది పరుగులకే ఔటైంది. దీంతో భారత్ కేవలం 19 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టును ఆదుకునే బాధ్యత తీసుకున్నారు. ప్రారంభంలో ఆచితూచి ఆడిన ఈ జోడీ క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత దూకుడు పెంచింది. జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ప్రతీకా రావల్ చక్కటి షాట్లతో ఆకట్టుకుంది. 57 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న ఆమె 67 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 61 పరుగులు చేసింది. హర్మన్‌ప్రీత్‌తో కలిసి మూడో వికెట్‌కు 124 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ప్రతీకా ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన తేజల్ హసబ్నిస్ మూడు పరుగులకే వెనుదిరగడంతో భారత్ 148 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయింది. కీలక సమయంలో వరుస వికెట్లు పడటంతో భారీ స్కోరు సాధించడం కష్టమేనని భావించినప్పటికీ హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. ఐదో వికెట్‌కు జతకట్టిన హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మ జింబాబ్వే బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఒకవైపు హర్మన్‌ప్రీత్ భారీ షాట్లతో విరుచుకుపడగా, మరోవైపు దీప్తి శర్మ వేగంగా పరుగులు రాబట్టింది. దీప్తి కేవలం 37 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుంది. హర్మన్‌ప్రీత్ 101 బంతుల్లో శతకాన్ని అందుకుంది. వీరిద్దరి దూకుడుతో భారత స్కోరు 300 పరుగుల మైలురాయిని దాటింది. హర్మన్‌ప్రీత్ 121 బంతుల్లో 15 ఫోర్లతో 126 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు పునాది వేసింది. హర్మన్‌ప్రీత్ వెనుదిరిగిన తర్వాత కూడా దీప్తి శర్మ తన జోరును కొనసాగించింది. కేవలం 83 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్న ఆమె 86 బంతుల్లో 15 ఫోర్లతో 106 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి శతకం సాధించిన దీప్తి భారత ఇన్నింగ్స్‌కు మరింత బలాన్ని చేకూర్చింది. హర్మన్‌ప్రీత్, దీప్తి అద్భుత భాగస్వామ్యంతో టీమిండియా 328 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. లక్ష్య ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లు కొంత ప్రతిఘటన కనబరిచినప్పటికీ భారత బౌలర్ల ధాటికి నిలువలేకపోయారు. మోడెస్టర్ ముపచిక్వా 49 పరుగులతో రాణించగా, చిపో ముగేరి తిరిపానో 46 పరుగులు చేసింది. చెలోన్‌డీ బీయా 34, కెప్టెన్ జోసెఫిన్ నకోమో 22, న్యాషా 20 పరుగులు చేశారు. అయితే కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో జింబాబ్వే లక్ష్యానికి చాలా దూరంలో నిలిచిపోయింది. భారత బౌలర్లలో వైష్ణవి శర్మ నాలుగు వికెట్లతో విజృంభించింది. బ్యాటింగ్‌లో సెంచరీ సాధించిన దీప్తి శర్మ బౌలింగ్‌లోనూ మూడు వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. మిగతా బౌలర్లు కూడా సమష్టిగా రాణించడంతో జింబాబ్వే 207 పరుగులకే ఆలౌటైంది. శతకంతో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన హర్మన్‌ప్రీత్ కౌర్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు మూడు వన్డేల సిరీస్‌ను 2--0తో కైవసం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టి ప్రదర్శన కనబరిచిన టీమిండియా ఇప్పుడు క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. ఇరు జట్ల మధ్య నామమాత్రపు మూడో వన్డే అక్టోబర్ 28న జరగనుంది.

తుమ్మిడిహెట్టిపై నేడే తాడోపేడో!

మొదటి తరువాయి


చెల్లించేందుకు కూడా సిద్ధమని స్పష్టం చేయనుంది. కేంద్ర జలవనరుల శాఖ జోక్యంతో రెండు రాష్ట్రాల మధ్య చర్చలకు మార్గం సుగమం కావడంతో ప్రాజెక్టు భవితవ్యంపై ఆసక్తి నెలకొంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును ప్రతిపాదించారు. కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించడంతోపాటు లక్షలాది ఎకరాలను సాగులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అప్పట్లో సుమారు రూ.900 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ప్రాజెక్టు నిర్మాణం నిలిచిపోయింది. అనంతరం ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోసే ప్రత్యామ్నాయాలపై గత ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పునరుద్ధరించి రాష్ట్ర సాగునీటి అవసరాలను తీర్చాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. అయితే బ్యారేజీ ఎత్తు విషయంలో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం ప్రధాన సమస్యగా మారింది. తుమ్మిడిహెట్టిని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే మహారాష్ట్ర పరిధిలో సుమారు 2,300 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా. ఇందులో అటవీ భూములు ఉండటంతో మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ముంపును తగ్గించేందుకు 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే అభ్యంతరం లేదని 2016లో స్పష్టం చేసింది. అయితే ఆ ఎత్తులో నిర్మాణం చేపడితే తెలంగాణకు ఆశించిన స్థాయిలో నీరు అందుబాటులోకి రాదని రాష్ట్ర నీటిపారుదల శాఖ అంచనా వేస్తోంది. నీటిపారుదల శాఖ హైడ్రాలజీ విభాగం రూపొందించిన నివేదికల ప్రకారం బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే 165 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకురావచ్చని అంచనా. అదే 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే 125 టీఎంసీలు, 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే కేవలం 55 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. బ్యారేజీ ఎత్తు తగ్గిన కొద్దీ నీటి వినియోగ సామర్థ్యం గణనీయంగా పడిపోతుందని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశాన్ని కేంద్ర జలసంఘం నివేదికల ఆధారంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన రికార్డులను సిద్ధం చేసింది. మహారాష్ట్ర అభ్యంతరాలను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఐదు ప్రత్యామ్నాయాలతో ప్రీ ఫీజిబిలిటీ నివేదికను రూపొందించింది. బ్యారేజీని 152, 150, 149, 148 మీటర్ల ఎత్తుల్లో నిర్మిస్తే నీటి లభ్యత, ముంపు ప్రభావం ఎలా ఉంటుందనే అంశాలను ఇందులో విశ్లేషించారు. ప్రాజెక్టు స్వరూపం, కాలువల మార్గం, ఆయకట్టు, అంతర్రాష్ట్ర సమస్యలు, నీటి లభ్యత తదితర అంశాలను నివేదికలో పొందుపరిచారు. 152 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించని పక్షంలో ప్రత్యామ్నాయ నిర్మాణ ప్రతిపాదనలను కూడా సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు తీసుకురానున్నట్లు సమాచారం. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే 71.5 కిలోమీటర్ల కాలువలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అదనంగా 22 కిలోమీటర్ల సొరంగం, ఐదు కిలోమీటర్ల ఓపెన్ టన్నెల్ నిర్మిస్తే ఎల్లంపల్లి, సుందిళ్లకు గురుత్వాకర్షణ ఆధారంగా నీటిని తరలించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టు డిజైన్లు, ముంపు వివరాలు, ఆర్వీ అసోసియేట్స్ రూపొందించిన సర్వే నివేదికలను మహారాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ముంపు భూములకు సంబంధించిన పరిహారంలో తెలంగాణ తన వాటాను చెల్లించేందుకు సిద్ధంగా ఉందని కూడా వివరించనున్నారు.

2028లో మళ్లీ కేసీఆరే సీఎం..

మొదటి తరువాయి


హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ సీనియర్ నాయకుడు జిబ్రాన్ షరీఫ్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు.కాంగ్రెస్ ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని కేటీఆర్ అన్నారు. దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీకి తెలంగాణ గుర్తుకు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో నిరుద్యోగ యువతను కలిసి ఉద్యోగాలపై హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని ఎంతవరకు నెరవేర్చిందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. మైనారిటీల సంక్షేమానికి రూ.4,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఆసరా పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తే సమాధానం చెప్పాల్సింది పోయి తిట్లు, అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో వరుస వివాదాలు, అవినీతి ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ పెద్దల కుటుంబ సభ్యులకు సంబంధించిన భూముల వ్యవహారాలు, వ్యాపార ఒప్పందాలపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. సుమారు రూ.200 కోట్ల విలువైనదిగా చెబుతున్న ఐదు ఎకరాల భూమిని రూ.7 కోట్లకే తన తమ్ముడికి బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు. అమెరికాలో నివసిస్తున్న మరో తమ్ముడికి సంబంధించినదిగా పేర్కొంటున్న రూ.1,000 కోట్ల డీల్‌పై సమగ్ర వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులతో భయపెట్టడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల హక్కు కూడా అని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఎదుర్కొనే సత్తా బీజేపీకి లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని ఆరోపించారు.

భారత బలగాలకు అసాధ్యమైన లక్ష్యమంటూ ఏదీ లేదు!



న్యూఢిల్లీ
భారత బలగాలకు అందని లక్ష్యమంటూ ఏదీ లేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. గత ఏడాది పాక్‌లోని ఉగ్రస్థావరాలపై 'ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన కచ్చితమైన దాడులు ఈ విషయాన్ని నిరూపించాయన్నారు. ఆ సమయంలో వాయుసేన వ్యూహాత్మకంగా ముందడుగు వేసి, ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ కొట్టిందని చెప్పారు. ప్రస్తుతం సైన్యం వద్ద ఉన్న అణ్వాయుధాలు, కచ్చితత్వంతో ఛేదించగల అధునాతన క్షిపణి వ్యవస్థలు శత్రువుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాయన్నారు.ఆ ఆపరేషన్‌తో స్వదేశీ ఆయుధాల శక్తిని ప్రపంచ దేశాలు చూశాయని పునరుద్ఘాటించారు. స్వదేశీ ఉత్పత్తుల తయారీ.. రక్షణ రంగం ఆధునికీకరణకే కాకుండా దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి సైతం బాటలు వేస్తోందన్నారు.

మా ర్యాలీకి పబ్లిసిటీ చేస్తున్నందుకు థ్యాంక్స్'..



న్యూఢిల్లీ
కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న భారీ నిరసన ర్యాలీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ ర్యాలీకి ఇండియా కూటమి నాయకుల కంటే బీజేపీ, దాని మిత్రపక్షాల నేతలే ఎక్కువ ప్రచారం కల్పిస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ర్యాలీపై విమర్శలు చేస్తూ పరోక్షంగా ప్రచారం కల్పిస్తున్నందుకు అధికార కూటమి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఏడు రోజులు కూడా ఇదే ఉత్సాహాన్ని, అంకితభావాన్ని కొనసాగించాలని ఎద్దేవా చేశారు. రామ్‌లీలా మైదానం వరకు చేపట్టనున్న నిరసన ప్రదర్శన నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. నవంబర్ 1న నిర్వహించనున్న ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో బీజేపీ నేతల విమర్శలపై రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. తమ నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రచారం కల్పిస్తున్నందుకు బీజేపీ, దాని మిత్రపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపడుతున్న పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికార కూటమి నాయకులే సహకరిస్తున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దేశంలో ఓటర్ల హక్కులను కాలరాసే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది మంది పేర్లను తొలగించారని, ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించారని విమర్శించారు. ప్రజల ఓట్లను దొంగిలిస్తున్నారని ఆరోపిస్తూ ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకుంటున్నాయని తాము ఆరోపిస్తున్న అక్రమాలపై ప్రశ్నించిన వారిని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు

రెండో పంట వేయొద్దు!

మొదటి తరువాయి

నిర్మించనున్న నాలుగు లైన్ల రహదారి పనులతో పాటు సెంట్రల్ లైటింగ్, డివైడర్, సీసీ డ్రైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా రూ.కోటి వ్యయంతో చేపట్టిన జంక్షన్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వానాకాలంలో రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చుకైనా వెనుకాడదని చెప్పారు. పంటలకు అవసరమైన నీరు, విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రానున్న కాలంలో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేశారు. కరువు పరిస్థితులను గతంలో ఎదుర్కొన్న అనుభవం రైతులకు ఉందని, ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సూపర్ ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. సంక్షోభ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు త్వరలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. సూపర్ ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా అవసరమని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా తెలంగాణకు వివక్ష లేకుండా సహాయ సహకారాలు అందిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన మద్దతు లభించేలా బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కొత్తగూడెంలో సైకిల్ ర్యాలీ





ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, 25, అక్టోబర్(వార్త సంధ్య)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, డి. ఎస్. పి అధ్యక్షతన పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు, పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి పాత డిపో, పోస్ట్ ఆఫీస్ సర్కిల్ మీదుగా కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లారు.ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారి సేవలను ప్రజలకు తెలియజేయడం, టీజీఎస్పి పోలీసుల సేవలు, త్యాగాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దేశం, సమాజం, ప్రజల రక్షణ కోసం అమరవీరులు చేసిన త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెలిపారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం, టీజీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్లు రామకృష్ణారెడ్డి, రంజిత్ కుమార్, సీఐలు వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, ఆర్ఐలు సుధాకర్, కృష్ణారావు, జి.వి. రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపేట కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, 25, అక్టోబర్(వార్త సంధ్య)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజుపేట కాలనీలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలు, నంబర్ ప్లేట్లు లేని 8 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 150 కేసులు నమోదు చేసి రూ.36,390 జరిమానా విధించారు.కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ అరుణ్ కుమార్ కాలనీవాసులతో మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి సేవించే వారిని గుర్తించి డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కాలనీలలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అటువంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, యూపీఐ పిన్‌లను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు.ప్రజల భద్రత, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సీఐ రాజు, వెంకటప్పయ్య, పోలీసు అధికారులు, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన సన్నద్ధం



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 25. :
ఈ సమావేశంలో పాలకుర్తి నియోజకవర్గ నాయకులకు ,కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంతో పాటు మండల స్థాయి నాయకులకు గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలు అందజేశారు.
ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వెళ్తూరు నగేష్, నాయకులు, మేడిద ప్రశాంత్ రెడ్డి, గట్ల సతీష్, కుంభ మహేష్, చింతల మధు, కొండ్లె ఉమేష్, దేశెట్టి వెంకటేష్, ఉదరపు వెంకటేశ్వర్లు, శివమణి, బన్నీ, అఖిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యారం--ఎర్రబోడు దారిలో మద్యం ఆటో బోల్తా!





-ఆటోల్లో హడావుడిగా పల్లెలకు మద్యం సరఫరా.. ఎవరి అండతో?

-బోల్తా పడగానే మరో ఆటోలోకి మద్యం మార్పిడి!

-ఎక్సైజ్ శాఖ అండదండలతోనే ఈ తంతు నడుస్తుందా?

-బెల్ట్‌షాపులకు మద్యం చేరుతున్నా పర్యవేక్షణ ఏది?

సింగరేణి(కారేపల్లి):
ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో ఆటోల ద్వారా పల్లె గ్రామాలకు మద్యం తరలిస్తున్న వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.మాణిక్యారం--ఎర్రబోడు మార్గంలో మద్యం తరలిస్తున్నట్లు చెబుతున్న ఓ ఆటో బోల్తా పడిన ఘటనతో గ్రామీణ ప్రాంతాలకు జరుగుతున్న మద్యం సరఫరా తీరు ఒక్కసారిగా తెరపైకి వచ్చింది.

స్థానికుల కథనం ప్రకారం..
మద్యం లోడుతో వెళ్తున్న ఆటో మాణిక్యారం--ఎర్రబోడు దారిలో బోల్తా పడింది. ఘటన జరిగిన కొద్దిసేపటికే ఆటో అక్కడికి చేరుకుని, బోల్తా పడిన తెలుపు రంగు ఛార్జింగ్ ఆటోలో ఉన్న మద్యం సరుకును అందులోకి మార్చి అక్కడి నుంచి తరలించినట్లు చెబుతున్నారు. ప్రమాదం జరిగినా సరుకును అక్కడి నుంచి హడావుడిగా మరో వాహనంలోకి మార్చి తరలించాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి వెళ్తోంది? గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు చేరవేస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఎక్సైజ్ శాఖ అండదండలతోనేనా?
మండలంలో ఇంత బహిరంగంగా ఆటోల ద్వారా మద్యం గ్రామాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నా ఎక్సైజ్ శాఖకు తెలియదా? లేక తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తోందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఈ మద్యం సరఫరా తంతు వెనుక ఎక్సైజ్ శాఖలో ఎవరి అండదండలైనా ఉన్నాయా? లేక అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని కొందరు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారా? అనే విషయం సమగ్ర విచారణలో వెలుగులోకి రావాల్సి ఉంది.

మద్యం దుకాణం నుంచి బెల్ట్‌షాపు వరకు..?
మద్యం దుకాణాల నుంచి పెద్ద మొత్తంలో సరుకును ఆటోల్లో పల్లెలకు తరలించాల్సిన అవసరం ఏమిటన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. ఏ దుకాణం నుంచి ఈ మద్యం బయటకు వచ్చింది? కొనుగోలుకు సంబంధించిన బిల్లులు ఉన్నాయా? ఒకే ఆటోలో ఎంత మద్యం తరలిస్తున్నారు? చివరకు ఆ సరుకు ఎవరి వద్దకు చేరుతోంది? అనే అంశాలపై ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.
గ్రామాల్లో బెల్ట్‌షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఒకవైపు.. ఆటోల ద్వారా మద్యం సరఫరా జరుగుతోందన్న విమర్శలు మరోవైపు వినిపిస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బోల్తా ఘటనతో బయటపడిందా అసలు తంతు?
మాణిక్యారం--ఎర్రబోడు దారిలో ఆటో బోల్తా పడకపోయి ఉంటే ఈ మద్యం తరలింపు వ్యవహారం బయటకు వచ్చేదా? ప్రమాదం జరిగిన వెంటనే మరో వాహనాన్ని తీసుకొచ్చి మద్యం తరలించడం వెనుక కారణమేంటి? బోల్తా పడిన ఆటో, మద్యం సరుకు ఎవరిది? ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.
ఈ ఘటనను ఎక్సైజ్ శాఖ సాధారణ ప్రమాదంగా వదిలేస్తుందా? లేక మద్యం సరఫరా మూలం నుంచి గమ్యస్థానం వరకు విచారణ జరిపి, బెల్ట్‌షాపుల వెనుక ఉన్న నెట్‌వర్క్‌తో పాటు అధికారుల పాత్ర ఏమైనా ఉందా అన్న కోణంలోనూ నిగ్గుతేలుస్తుందా? అనేది వేచి చూడాలి.

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఘాటు వ్యాఖ్యలు..

గర్వం తలకెక్కి మాట్లాడొద్దు.. వయసుకు తగ్గ మాటలు మాట్లాడాలి.

నువ్వు వెయ్యి మందితో వస్తే.. నేను 50 వేల మందితో వస్తా.. ఎమ్మెల్యే

వార్త సంధ్య :వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 25:
అహంకారపూరిత పాలన వద్దని, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేమని వనపర్తి ప్రజలు గత ఎన్నికల్లోనే తీర్పు చెప్పారని, అయినా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తీరు మారకపోవడం బాధాకరమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు. వయసుకు తగ్గ మాటలు మాట్లాడాలని హితవు పలికారు. గర్వం తలకెక్కి మాట్లాడుతున్నారు నువ్వు 1000 మందితో వస్తే నేను 50 వేల మందితో వస్త వయసుకు తగ్గ మాటలు మాట్లాడాలి.నీ అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పి ఇంటికి పంపారు. వనపర్తి ప్రజలు విజ్ఞులు అన్ని గమనిస్తున్నారు.విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పై ఘాటు వ్యాఖ్యలు చేసిన ఎమెల్యే మేఘారెడ్డి.రానున్న కాలంలోనూ నీకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ఆదివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారూ.నవంబర్ 30న ప్రజాక్షేత్రంలో ఓటమిపాలైన ఓ మాజీమంత్రి తెలంగాణ రాష్ట్రంలోనే నెంబర్ ఫోర్ అని చెప్పుకునే వ్యక్తి ఇటీవల మతిభ్రమించి అహంకారపూరితమైన మాటలు మాట్లాడుతున్నారని,వయసుకు తగ్గిన మాటలు మాట్లాడాలని ఏడు పదుల వయసులో మీరు వెయ్యి మందితో వస్తే మేము 50 వేల మందితో వస్తామని



దేనికైనా సిద్ధమని ఎమ్మెల్యే ఘాటు హెచ్చరిక చేశారు.రాష్ట్రంలో 4వ నంబర్ నాయకుడిగా చెప్పుకునే మాజీ మంత్రి 2014 నుంచి 2023 వరకు వనపర్తిని అభివృద్ధి పేరుతో ధ్వంసం చేశారని మేఘారెడ్డి ఆరోపించారు.32 మంది బీసీ నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించారని,విలేకరులను సైతం వదలకుండా అట్రాసిటీ కేసులు నమోదు చేసిన రోజులను ప్రజలు మర్చిపోలేదన్నారు. నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నిరుద్యోగులు, వివిధ వర్గాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన పాలనకు ప్రజలు చరమగీతం పాడారని వ్యాఖ్యానించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పోస్టులకు ధరలు నిర్ణయించి కమిషన్లు వసూలు చేశారనే ఆరోపణలు కూడా చేశారు.గత పాలనలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకునే ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారని మేఘారెడ్డి అన్నారు.నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజల తీర్పును గౌరవించాలని సూచించారు. జీవితంలో ఒక్కసారే ఎమ్మెల్యే అయ్యారంటూ నిరంజన్‌రెడ్డిని ఎద్దేవా చేశారు.నాగర్‌కర్నూల్‌లో పుట్టి, కొల్లాపూర్‌లో పెరిగి, వనపర్తిలో రాజకీయ ఆధిపత్యం చెలాయిస్తామంటే కుదరదని స్పష్టం చేశారు.మాజీ మంత్రి అహంకారానికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో ఏం చేసిందో, కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో ఏం చేస్తుందో ప్రజల సమక్షంలో చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మేఘారెడ్డి సవాల్ విసిరారు.బీఆర్ఎస్ పాలనకు సంబంధించిన పత్రాలు తీసుకొచ్చి చర్చకు రావాలని, తాను ఎలాంటి పత్రాలు లేకుండానే చర్చించేందుకు సిద్ధమని అన్నారు.అభివృద్ధి విషయంలో ఎవరి పాలన ఎలా ఉందో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు.వెయ్యి మందితో కలిసి నడిబజారులో చెప్పుతో కొడతానంటూ మాట్లాడటం ఏ విధమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు. వయసులో పెద్దవారైనా మాటతీరు,ప్రవర్తనలో హుందాతనం ఉండాలని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో బెదిరింపులకు, అహంకారపూరిత వ్యాఖ్యలకు స్థానం లేదన్నారు. వనపర్తి విద్యావంతులు,విజ్ఞులు, మేధావులు,రాజకీయ విశ్లేషకులు ఈ పరిణామాలను గమనించి ఆలోచించాలని కోరారు.అహంకారంతో వ్యవహరించే నాయకుడు కావాలా,ప్రజలకు సేవ చేసే నాయకుడు కావాలా అన్నది ప్రజలే నిర్ణయించాలని అన్నారు.ఎంతమందితో వచ్చినా ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానంటూ మేఘారెడ్డి అన్నారు.వచ్చే ఎన్నికల్లో నిరంజన్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ రావడం కూడా అనుమానమేనని,ఒకవేళ టికెట్ వచ్చినా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. వనపర్తి రాజకీయాల్లో బెదిరింపులు,వ్యక్తిగత దూషణల కంటే అభివృద్ధి, ప్రజాసేవే ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి, జిల్లా పార్టీ కార్యవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీలో ఉన్న కండక్టర్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన మంత్రి పొన్నం ప్రభాకర్

-గాయపడిన కండక్టర్ ప్రవళికకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం

-దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ (వార్త సంధ్య)అక్టోబర్ 25.
మణుగూరు డిపోకు చెందిన టీజీఎస్ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక విధుల్లో ఉన్న సమయంలో ఆమెపై జరిగిన దాడిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో మంత్రి మాట్లాడి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఉన్న కండక్టర్‌పై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు



చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. దాడిలో గాయపడిన కండక్టర్ ప్రవళికకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. విధుల్లో ఉన్న సిబ్బందితో ప్రయాణికులు సహృదయంతో వ్యవహరించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి దాడులు చేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరం రవాణా సేవలు అందిస్తున్న ఆర్టీసీ కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

గోదావరి జలాలను ఒడిసిపట్టి వేసవి
తాగునీటి ఎద్దడి తీర్చడమే మన లక్ష్యం





-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, 25, అక్టోబర్(వార్త సంధ్య)

గోదావరి జలాలను ఒడిసిపట్టి వేసవి తాగినీటి ఎద్దడిని తీర్చడమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు ఆదేశించారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఒక టీఎంసీ నీటి నిల్వకు చర్యలు చేపట్టాలని,ఇసుక బస్తాల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలి

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి పొదుపుపై ప్రజలకు తెలియజేశారు.నీటి లభ్యతకు అనుగుణంగా రబీ పంటలు వ్యవసాయ రైతులు సాగు చేయాలి చెప్పారు.ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.ఆనకట్టపై ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసేందుకు చేపడుతున్న పనులను పరిశీలించిన మంత్రి, పనుల పురోగతి, గోదావరి నీటి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మగారిపల్లి నుంచి దుమ్ముగూడెం వరకు పడవలో ప్రయాణిస్తూ ఆనకట్ట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దుమ్ముగూడెం వైపు ఆనకట్టపై ఇసుక బస్తాలతో చేపడుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు కార్మికులను నియమించి, పడవలను పెంచి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్న అంచనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక రంగం, ప్రజారోగ్యం, పశుసంపదపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయడం తమ ఉద్దేశం కాదని, రానున్న పరిస్థితులను ముందుగానే అర్థం చేసుకుని నష్టాలను నివారించేందుకు ప్రజల్లో అవగాహన, ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.ఈ ఏడాది వర్షపాతం లోటు, నదులు, వాగులు, వంకల్లో తగ్గిన నీటి ప్రవాహాలు, రిజర్వాయర్లలో పరిమిత నీటి నిల్వల కారణంగా భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో బోర్ల నుంచి నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చడం ప్రధాన సవాలుగా మారే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటి వృథాను నివారించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి గోదావరి నీటిని నిల్వ చేయడం ద్వారా రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు ఆనకట్టపై సుమారు ఒక మీటర్ ఎత్తున ఇసుక బస్తాల పొరలను ఏర్పాటు చేసి దాదాపు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ నీటి నిల్వ ద్వారా తాగునీటి అవసరాలకు అవసరమైన నీటిని అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సాధారణంగా వేసవిలో గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోయే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే నీటిని నిల్వ చేయడం అవసరమని తెలిపారు .ఆనకట్టపై ఇసుక బస్తాల ఏర్పాటు పనులను వేగవంతం చేసేందుకు రోజుకు 10 వేల నుంచి 15 వేల బస్తాలను ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సుమారు లక్షన్నర ఇసుక బస్తాలు అవసరం అవుతున్నాయాన్నారు.అవసరాన్ని బట్టి కార్మికుల సంఖ్యను పెంచి, పనులకు ఆటంకం కలగకుండా అదనపు పడవలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాతావరణ శాఖ వర్ష సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ గోదావరి ప్రవాహంలో వచ్చే మార్పులకు అనుగుణంగా పనులు నిర్వహించాలని, ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి ప్రవాహం పెరిగినప్పటికీ చేపట్టిన పనులకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే నీటి నిల్వలను కాపాడుకోవడం అత్యంత అవసరమని మంత్రి స్పష్టం చేశారు. భద్రాచలంతో పాటు ఇతర ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి పంపిణీని సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆనకట్ట వద్ద నీటిని నిల్వ చేస్తూనే అవసరమైన ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఒక టీఎంసీ నీటి నిల్వ లక్ష్యాన్ని సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రబీ సాగులో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను అంచనా వేసుకుని అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని కోరారు. తక్కువ నీటితో పండే కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూమిలో ఉన్న తేమ, నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని, అధిక నీటి అవసరం ఉండే పంటల సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ప్రస్తుత సీజన్‌లో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టుకు నీటిని అందించడంతో పాటు వైరా, లంకసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తుమ్మల చెరువు, సింగభూపాలం, అన్నదైవం, మూకమామిడి వంటి చెరువులను నింపడం ద్వారా భూగర్భ జలాల పెంపు, పశువులకు నీటి లభ్యత, రైతుల సాగు అవసరాలకు ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందించడంతో పాటు పండించిన పంటలను కొనుగోలు చేయడం, రైతు భరోసా వంటి సహాయక చర్యలను కొనసాగిస్తూ రైతాంగానికి అండగా నిలుస్తున్నామని మంత్రి తెలిపారు. రానున్న కాలంలో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అఖిలపక్షంతో చర్చించి, అవసరమైన సహాయ సహకారాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తామని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు ఉపయోగపడే పనులను చేపట్టాలని మంత్రి సూచించారు. పంట కాలువల మరమ్మతులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, చెరువుల్లో పూడికతీత, గ్రామీణ రహదారుల అభివృద్ధి వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా గ్రామీణ ఉపాధిని పెంచడంతో పాటు భవిష్యత్తులో నీటి వనరులను మెరుగుపరుచుకోవచ్చన్నారు. పశువులకు, అవసరమైన చోట అడవి జంతువులకు కూడా నీటి లభ్యత కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొంటూనే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు.నీటి పొదుపు, విద్యుత్ పొదుపు, ప్రజారోగ్య పరిరక్షణపై గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి కోరారు. రైతు వేదికలు, గ్రామసభల ద్వారా రైతులకు వాతావరణ పరిస్థితులు, పంటల ఎంపిక, నీటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సూచనలు అందించాలని ఆదేశించారు. అంత పెద్దది రానున్న కాలంలో నీటి కొరత తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు, కూడా భాగస్వాములు కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. నీటి వనరుల పరిరక్షణ, తాగునీటి పొదుపు, రైతులకు అవగాహన కల్పించడం వంటి అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసే లక్ష్యాన్ని సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో ఇరిగేషన్ శాఖా ఎస్ ఈ, అమ్మగారి పల్లి సర్పంచ్ కవిత, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులు
సకాలంలో హాజరు కావాలి

-జిల్లా కలెక్టర్ అంకిత్



ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, 25, అక్టోబర్(వార్త సంధ్య)

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని ఆయన సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ కార్యాలయం భద్రాచలం, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన అన్నారు.కావున ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

పేరుపల్లి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

-వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

-సర్వోత్తమ రెడ్డిని సన్మానించిన పేరుపల్లి కాంగ్రెస్ నాయకులు




సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 25 (వార్త సంధ్య):

పేరుపల్లి గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం వైరా క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు కేటాయించి సహకరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఖమ్మం--వరంగల్--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బానోత్ వీరభద్రు, బండారి నాగేష్, మధ్యాహ్నపు సుధాకర్, అంచ శ్రీనివాసరావు, మధ్యాహ్నపు ల్లయ్య, పప్పుల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



వార్త సంధ్య కూకట్‌పల్లి :

హైదరాబాద్--మహబూబ్‌నగర్--రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అర్హులైన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకులకు సూచించారు. ఆదివారం ఆయన నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టభద్రులు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. నమోదు ప్రక్రియలో ప్రజలకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేస్తూ సహాయపడాలని తెలిపారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ సరైన పంపిణీ లేక ప్రజలు మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని విమర్శించారు. విద్యుత్ సరఫరా సమస్యలపై కూడా ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని పేర్కొన్నారు. నాయకులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కాండి

- జనసేన తెలంగాణ ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్

వార్త సంధ్య కూకట్‌పల్లి :

తెలంగాణలో రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బలంగా పోటీ చేస్తుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. కూకట్‌పల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ... పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణలో అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ రాబోయే ఎన్నికల్లో సముచిత స్థానం దక్కుతుందని స్పష్టం చేశారు.
శంకర్ గౌడ్ ప్రసంగంలోని .




పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నిరంతరం ప్రజల్లో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాడాలి.
పార్టీ అధినేత పవన్ కళ్యాణ్
ఆశయాలను, సిద్ధాంతాలను, జనసేన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి.
కార్పొరేషన్ల పరిధిలోని వార్డులు, డివిజన్ల స్థాయిలో కమిటీలను బలోపేతం చేసుకుంటూ పక్కా ప్రణాళికలతో ముందుకెళ్లాలి. తెలంగాణ రాజకీయ భవిష్యత్తుకు ఈ స్థానిక ఎన్నికలు దిక్సూచిగా మారనున్నాయని, నాయకులందరూ సమన్వయంతో పనిచేసి విజయం దిశగా అడుగులు వేయాలని కోరారు.
ఈ సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.కే. సాగర్, జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, రాష్ట్ర నాయకులు మచ్చ సుధాకర్ తదితరులు మాట్లాడారు. ప్రతి డివిజన్‌లో పార్టీ బలాన్ని పెంచుకోవాలని, ప్రజలతో మమేకమై ప్రజా ఆదరణ పొందిన నాయకులకే రాబోయే ఎన్నికల్లో కార్పొరేటర్ సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామకృష్ణ, రాదరాం రాజలింగం, దామోదర్ రెడ్డి, కావ్యతో పాటు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధికి చెందిన పలువురు జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు విశేషంగా పాల్గొన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సంపాదకీయం

బియ్యం రేటులో రైతుకు దక్కిందెంత?!



'సన్నబియ్యం ధర రూ.95 రూపాయలకు పెరిగింది.. నా వల్లే!' అని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పగా చెప్పుకొంటున్నారు. బియ్యం రేటు పెరగడం గొప్ప అనుకుంటే అలా పెరిగిన పుణ్యమంతా సీఎమ్మే మూటగట్టుకోనీ. కానీ ఆ బియ్యాన్ని పండించిన రైతన్నకు దక్కిన లాభమెంతో కూడా చెప్తే అన్నదాతలు పులకించిపోతరు కదా! పగలనకా, రాత్రనకా, ఎండనకా, వాననకా మట్టిలో మట్టయి పంట పండిస్తరు రైతులు. అప్పులు చేసి విత్తనాలు తెస్తరు, ఎరువుల కోసం ఎన్నో అవస్థలు పడుతరు, కూలీలకు పైసలియ్యలేక తిప్పలు పడుతరు. తీరా వడ్లు చేతికొస్తే కొనుగోలు కేంద్రాల దగ్గర పడిగాపులు కాస్తరు. తాలు పేరుతో కోతలు, తేమ పేరుతో కొర్రీలు.. రైతన్నకు మాత్రం కంటినిండా కన్నీళ్లు, జేబునిండా అప్పులే! మరి సన్నబియ్యం కేజీ రూ.95 అయితే ఆ పైసలతో రైతన్న ఇంట్లో గుమ్మీలు నింపుకొన్నడా? అదేం లేదు కదా! పండించేటోళ్లు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. మధ్యలో దళారులు మాత్రం కుర్చీల్లో కూసొని లాభాల పంటలు పంచుకుంటున్నారు. చెమటోడ్చినోళ్లకు చిల్లిగవ్వ దక్కుతలేదు. ఇదేనా రైతన్నకు దక్కుతున్న రాజభోగం? బ్రోకర్ల దోపిడీని సర్కారీ ఘనతగా చెప్పుకోవడం సీఎం తెవివితేటలు ఎంత గొప్పవో తెలియజేస్తున్నది.

నీళ్లు ఆంధ్రకు.. నీతులు ప్రజలకు!

రేవంత్ సర్కార్ తీరు చూస్తుంటే నవ్వాలో ఏడ్వాలో అర్థం కాని పరిస్థితి! లెక్కలు చూస్తేనేమో వర్షపాతం లోటు తెలంగాణాలో తక్కువే కనిపిస్తున్నది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో లోటు ఎక్కువే ఉన్నా, అక్కడ రైతుల హాహాకారాలు ఇంతగా లేవు! మరి మన తెలంగాణలనే కరెంటు కష్టాలు, నీళ్ల గోసలు ఎందుకని ఆలోచించి.. ఇదంతా ప్రకృతి మహిమే అనుకుంటే పొరపాటే సుమీ! ఏడాది ముందునుంచే ఎల్ నినో ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరికలు వస్తున్నయ్. అయినా సర్కార్‌కు చెవికెక్కినట్టు లేదు. నీళ్లు ఆంధ్రాకు తరలిపోయినయి. ఇదంతా చోద్యం చూసిన పాలకులు పంప్ హౌస్‌లతో నీటిని ఎత్తాలని ఆలోచించలేదు. అప్పుడు నీళ్లను ఒడిసిపట్టే తెలివి లేకపాయె.. ఇప్పుడు మాత్రం చుక్క నీళ్ల కోసం జనం అల్లాడుతుంటే ఉపదేశాలు మొదలుపెట్టిండ్రు ముఖ్యమంత్రివర్యులవారు! కనీసం నెల రోజులు నీళ్లు ఎత్తిపోయలేక, పదినెలల కరువును ప్రజల నెత్తిన రుద్దుతుండ్రు! చేతులు కాలినంక ఆకులు పట్టుకున్నట్టు, సీజన్ అంతా గడిచిపోయాక సర్కార్ నిద్ర లేచినట్టు నటిస్తున్నది. ఇప్పుడు తాగునీళ్లు లేవంటరు, సాగునీళ్లు ఇవ్వలేమంటరు, కరెంటు పొదుపుగా వాడాలంటరు. ఏసీలు వేయొద్దంటరు, లైట్లు వెలిగించొద్దంటరు! ప్రకృతి విపత్తుల్ని ముందే పసిగట్టి సిద్ధపడటం పాలకుల బాధ్యత కాదా? నీళ్లను ఇడిసిపెట్టి, ఇప్పుడు ప్రజలకు నీతులు చెప్పడం ఏం పాలనయ్యా బాబూ? బాబు చెప్పినట్టు నడిచే పాలననా?

సర్వీస్ నుంచి దిగిపోతే గతేంటి?

తెలంగాణలో కాంగ్రెస్ పాలన చూస్తుంటే ఓ సామెత గుర్తుకొస్తున్నది. ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత! డ్యూటీలో ఉండే పోలీసులకే వైద్యం అందించలేని దుస్థితి ఉంటే, ఇక సామాన్యుల ఆరోగ్యానికి దిక్కెవరు మహాశయా? సర్వీసులో ఉన్న హెడ్ కానిస్టేబుల్ దేవసోత్ శంకర్ నాయక్ అనారోగ్యంతో సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతుంటే, ఈహెచ్ఎస్ సౌకర్యం సమయానికి అందకపోవడం ఎంత దారుణం! అడ్వాన్స్ డబ్బులు కట్టలేదని దవాఖానలో వైద్యం కోసం ఇబ్బందులు పడాల్సిన దుస్థితి. చివరికి తోటి ఉద్యోగులే చందాలు వేసుకొని చికిత్స చేయించాల్సి వచ్చిందంటే, ప్రభుత్వ ఆరోగ్య భద్రత ఏ మూలకు పోయినట్టో! బహుశా రేవంత్‌కు తెలుసేమో! కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు అమలులో ఉన్న పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఉద్యోగుల సంక్షేమం కాగితాల మీద బాగుంటే సరిపోదు కదా! ఆపదొచ్చినప్పుడు ఆదుకోవాలె గానీ, ఫైళ్లను ఒక టేబుల్ నుంచి ఇంకో టేబుల్‌కు తిప్పుకొంటూ రోగి ప్రాణాలతో దోబూచులాడుడేంది? బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన మాట ప్రకారం, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం మానవత్వానికి నిదర్శనం. బీఆర్ఎస్ బృందం దవాఖానను సందర్శించిన తర్వాతే ఈహెచ్ఎస్ అధికారులు మేల్కొన్నారు. ప్రభుత్వం రాజకీయ కక్షలతో కేసులు, అరెస్టుల మీద చూపించే శ్రద్ధలో సగమైనా ఉద్యోగుల ఆరోగ్య భద్రత మీద పెడితే బాగుంటది కదా! సర్వీసులో ఉన్న పోలీసుకే ఈ గతి పడితే, రిటైరైన ఉద్యోగుల పరిస్థితి ఇంకెంత దయనీయమో!

ఫామ్ హౌస్ ఫైలుతోనే టైమ్ పాస్!

రేవంత్ పాలనలో కామెడీకి కొదువ లేదని మల్లమల్ల రుజువైతున్నది. మొన్నటిదాకా కేసీఆర్‌ది వెయ్యికరాల ఫామ్ హౌస్ అంటూ గాలి మాటలతో గోల చేసినోళ్లే, ఇప్పుడు ఆ ఆరోపణలను నిజమని నిరూపించలేక నానా తంటాలు పడి చివరాఖరికి అరవై ఏడెకరాల దగ్గరికి వచ్చిండ్రు. అందులోనూ ఎలాంటి ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు లేవని తేలింది. ఇప్పుడు కాంగ్రెసోళ్లకు మాటలు రావడంలేదు. ఈ ముచ్చట కూడా ఎక్కడా మాట్లాడే ధైర్యం చేస్తలేరు. అడ్డమైనోళ్లంతా ఆరోపణలు చేస్తరు, కానీ ఆధారాలు చూపిస్తేనే కదా నిలబడేది. గాలిలో మేడలు కట్టినోళ్లు, ఇప్పుడు ఆ మేడలకు పునాదులు వెతుకుతున్నరు. ఇక కొండపోచమ్మ సాగర్ కట్టిందే కేసీఆర్ ఫామ్ హౌస్ బావి నింపడానికి అన్నట్టు మాట్లాడితే, పిట్టలదొరలు కూడా పగలబడి నవ్వుతరు. లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే ప్రాజెక్టును పట్టుకొని, ఎవరో ఒకరి బావి కోసమే కట్టినట్టుగా కట్టుకథలు అల్లితే ఎవరు నమ్ముతరు? ప్రాజెక్టుల ప్రయోజనాలపై చర్చించాల్సింది పోయి, బావుల చుట్టూ రాజకీయాలు తిప్పడం కూడా ఓ పాలననేనా?! కాంగ్రెస్ నేతలు ఇంకో నాలుగు రోజులు టైమ్‌పాస్ చేయడం కోసం కొత్త డ్రామా షురూ చేసినా చేస్తరేమో! 'రామగుండం నుంచి కరెంట్ లైన్లు వేసింది కేసీఆర్ ఫామ్ హౌస్ కోసమే.. విచారణ జరుపుతాం' అని మరో పొంగులేటి బ్రాండ్ బాంబు పేల్చినా పేల్చుతారేమో! ప్రజలకు కావాల్సింది కరెంటు, నీళ్లు, రైతులకు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు. కానీ పాలకుల దృష్టంతా పనికిరాని ఆరోపణల కోసమే అయితే ఎట్లా? తప్పులు జరిగినట్టు చెప్పి ఆధారాలు చూపకపోతే, జనం ఛీకొడుతారనే ఆలోచనైనా ఉండకపోతే ఎట్ల? కాంగ్రెసోళ్లకు అంత సోయి ఉంటే మన బతుకులు ఇట్లెందుకు ఉంటుండే కనీ!

దేశాన్ని కాపాడుతున్నది యువతనే!



దేశంలోని ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కాదు చివరకు మన ఆర్థిక వ్యవస్థను బతికిస్తున్నది కూడా యువతనే. 'విదేశాల్లో అంట్లు తోమి బతుకుతున్నారు' అని యువతను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చులకన చేసి మాట్లాడినా, ప్రశ్నిస్తున్న యువతను 'దిమాగీ నక్సల్స్' అని ప్రధాని నరేంద్ర మోదీ చిన్నచూపు చూస్తున్నా దేశాన్ని ఆర్థికంగా కుంగిపోకుండా నిలబెడుతున్నది యువతనే. ప్రపంచంలో ముడి చమురు ధర 114.22 డాలర్లకు, డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.94.93 చేరుకున్నది. పులి మీద పుట్రలా ఈ రెండు దెబ్బలు సరిపోవు అని విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రెండేండ్లలోనే రూ.5.5 లక్షల కోట్ల నిధులు మన మార్కెట్ నుంచి తరలించుకు వెళ్లారు. ఈ మూడు దెబ్బలతో మన స్టాక్ మార్కెట్ మాత్రమే కాదు, మొత్తం ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి నెలకొన్నది. ఈ స్థితి నుంచి దేశాన్ని ఆర్థికంగా రక్షిస్తున్నది యువతనే. ప్రపంచంలో అనేక దేశాల్లో ఉద్యోగాలు చేస్తూ తమ సంపాదనను ఇండియాకు పంపిస్తున్న యువత వల్ల విదేశీ మారకద్రవ్యం నిలువలు అడుగంటకుండా గౌరవ ప్రదంగా నిలిచాయి. కరోనా తర్వాత మన దేశంలోని యువత ఉద్యోగ భద్రత లేకపోవడం, భవిష్యత్తు కోసం పొదుపు అనే ఆలోచన చేయడం మొదలు పెట్టారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) ద్వారా నెలనెలా పెద్ద మొత్తంలో యువత ఇన్వెస్ట్ చేస్తున్నారు. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఎంత వేగంగా నిధులు తీసుకువెళ్తున్నారో అంతే వేగంగా యువత సిప్ ద్వారా ఆ లోటును భర్తీ చేస్తున్నది. దేశవిదేశాల్లోని యువత ఇప్పుడు ఆదుకోకపోయి ఉంటే దేశం మరింతగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఉండేది. ఇలాంటి యువతకు పాలకులు 'దిమాగీ నక్సల్స్' అని పేరు పెట్టినా, అంట్లు తోమడానికి విదేశాలకు వెళ్తారు అని తిట్టినా దేశాన్ని ఇప్పుడు ఆర్థికంగా ఆదుకుంటున్నది వాళ్లే. క్రూడ్ ఆయిల్ దిగుమతి బిల్లు ఏటా 137 బిలియన్ డాలర్లు, అంటే మన రూపాయల్లో రూ.11.5 లక్షల కోట్లు. విదేశాల్లో పని చేసే భారతీయులు ఏటా పంపే నిధులు 135.46 బిలియన్ డాలర్లు అంటే రూ.11.4 లక్షల కోట్లు. క్రూడ్ ఆయిల్ బిల్లుకు మనం చెల్లించే నిధులు, విదేశాల నుంచి మన మనవాళ్లు పంపే నిధులు దాదాపు సమానంగా ఉన్నాయి. విదేశీ మారకద్రవ్యం విషయంలో విదేశాల్లో పని చేసే మన వాళ్లు దేశానికి ఈ విధంగా అండగా నిలిచారు. ఇక సిప్‌ల ద్వారా మన యువత 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3.5 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అదే సమయంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1.81 లక్షల కోట్లు దేశం నుంచి తరలించుకుపోయారు. నిరుడు విదేశీ పెట్టుబడిదారులు తరలించిన దాని కన్నా మన వాళ్లు సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసింది దాదాపు రెట్టింపు. అయితే ఇది ఇప్పుడు చాలా వేగంగా రివర్స్ అవుతున్నది. ఈ సెప్టెంబర్‌లో సిప్‌ల ద్వారా రూ.32,490 కోట్ల పెట్టుబడులు వస్తే అదే నెలలో విదేశీ పెట్టుబడిదారులు రూ.44,013 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఈ అంతరం చాలా వేగంగా పెరిగే అవకాశం ఉన్నది. సిప్‌ల ద్వారా ఇన్వెస్ట్ చేస్తున్నది ఎక్కువగా యువతనే. సిప్‌లపై రెండున్నరేండ్ల నుంచి ఎలాంటి లాభం లేదు. పైగా దాదాపు 25 శాతం వరకు నష్టం వచ్చింది. మార్కెట్లో పరిస్థితి ఇలానే ఉంటే క్రమంగా సిప్‌ల మీద ఆసక్తి తగ్గుతుంది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు గత తొమ్మిదేండ్లలో మన దేశంలో ఎంత మొత్తం ఇన్వెస్ట్ చేశారో, కేవలం రెండేండ్లలో అంత మొత్తం వెనక్కి తీసుకున్నారు. 2015 అక్టోబర్ నుంచి 2024 అక్టోబర్ నాటికి మన మార్కెట్‌లో 63.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. 2024 అక్టోబర్ నుంచి 2026 అక్టోబర్ నాటికి 63.6 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఈ నెల ముగింపునకు ఇంకా వారం రోజుల గడువు ఉన్నది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధుల తరలింపు ఆగడం లేదు. ఇక్కడ కాకపోతే ఇంకెక్కడ పెట్టుబడి పెడతారు అని స్టాక్ మార్కెట్ నిపుణులు ఏడాది క్రితం ఆత్మవిశ్వాసంతో ప్రకటించేవారు. నిధుల తరలింపు ప్రవాహం ఆగకపోవడంతో ఇక్కడ కాక పోతే ఇంకెక్కడ ఇన్వెస్ట్ చేస్తారు అనేవారి మాటల్లో ఇప్పుడు ఆ ఆత్మవిశ్వాసం కనిపించడం లేదు. మన రూపాయల్లో అంటే 2026 అక్టోబర్ నాటికి రూ.5.5 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఏఐ సెమీ కండక్టర్ రంగాల్లోకి నిధులు తరలి వెళ్తున్నాయని మొదట నిపుణులు అంచనా వేశారు. ఆ దేశాల్లో ఏఐ బుడగ పేలిపోయినప్పటికీ మన దేశం నుంచి నిధుల ప్రవాహం తరలివెళ్లడం ఆగలేదు. అక్కడ ఏఐ ప్రతికూల పరిస్థితుల్లో మన దేశానికి పెట్టుబడులు తరలి రావాలి. కానీ రావడం కాదు. కనీసం మన దేశం నుంచి నిధులు తరలివెళ్లడం కూడా ఆగలేదు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మన దేశం నుంచి నిధులు తరలించుకువెళ్లడం గురించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విచిత్రమైన వాదన చేశారు. మన దేశ మార్కెట్ నుంచి సులభంగా నిధులు తరలించుకు వెళ్లే అవకాశం ఉన్నది కాబట్టి విదేశీ సంస్థాగత పెట్టుబడి దారులు నిధులు తరలిస్తున్నారట. దొంగతనాలు ఎందుకు జరుగుతున్నాయి అంటే 'సంపద ఉన్నది కాబట్టి దొంగతనాలు జరుగుతున్నాయి' అని సమర్థించుకున్నట్టుగా ఉన్నది. దేశంలోకి విదేశీ నిధులు రావడం అంటే దేశంలో ఉపాధి అవకాశాలు పెరుగడం. నిధులు తరలివెళ్తున్నాయి అంటే ఉపాధి అవకాశాలకు గండి పడుతున్నదని అనే అర్థం. ఈ విషయం పాలకులు గ్రహించాలి. స్టాక్ మార్కెట్‌లో రక్తపాతాన్ని అడ్డుకోవడానికి, నిధుల తరలింపునకు సరైన కారణాలను కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోకపోతే, సమస్య పరిష్కారానికి పూనుకోక పోతే, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలో పడుతుంది.

రాజకీయాలలో 'భారతీయ ఆత్మ' ఎక్కడ?



భారత రాజకీయ యవనికపై ప్రస్తుతం నడుస్తున్న పరిణామాలు కేవలం సాధారణ ప్రభుత్వ మార్పిడి లేదా ప్రతిపక్షాల విమర్శల చుట్టూ మాత్రమే తిరగడం లేదు. అది అంతకంటే లోతైన, తీవ్రమైన ప్రజాస్వామ్య సంక్షోభాన్ని సూచిస్తోంది. సృష్టి, వినాశనాల మధ్య సాగే మహా తాండవ నృత్యానికి నిర్దిష్టమైన ప్రణాళిక అవసరం లేదని, విశ్వానికి ఆ అడుగులు ముందే తెలుసని కాంగ్రెస్ నాయకుడు రాహు ల్ గాంధీ పేర్కొన్న మాటలు ప్రస్తుత రాజకీయ వాతావరణానికి సరిగ్గా సరిపోతాయి. అధికార పీఠంపై ఉన్న ప్రభుత్వ అణచివేత చర్యలు ఎంతటి తీవ్రమైన స్థాయికి చేరుతున్నాయో, దానికి అంతే స్థాయిలో వీధుల్లో యువత నుంచి తీవ్రమైన తిరుగుబాటు ఎదురవుతోంది. ఈ పరిస్థితులు దేశ రాజకీయ భవిష్యత్తును ఒక సరికొత్త మలుపు తిప్పే సూచనలను స్పష్టంగా కనిపింపజేస్తున్నాయి.నేడు మన కళ్లముందు కనిపిస్తున్న అత్యంత విచారకరమైన నిజమేమిటంటే, వలసపాలన ముగిసి దశాబ్దాలు గడిచినా, భారత పాలనా యంత్రాంగం, రక్షక భట వ్యవస్థలు ఇంకా నాటి ముద్రల నుంచి బయటపడలేకపోవడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడు చెప్పేదే నిజమని నమ్మి, అతడు తప్పు చేశాడని నిరూపించే బాధ్యత ప్రభుత్వంపై ఉండాలి. కానీ మన దేశంలో ప్రతి పౌరుడినీ అనుమానాస్పదంగా చూడటం, అతడు తన నిర్దోషిత్వాన్ని తాను నిరూపించుకోవాల్సిన పరిస్థితికి నెట్టడం పరిపాటిగా మారింది. పోలీసు బలగాలు సైతం తమ రాజకీయ యజమానుల ప్రయోజనకరం, వారి ఆదేశాలతో శాంతియుత నిరసనకారులు, మహిళలు, విద్యార్థులపై నిర్దాక్షిణ్యంగా దాడులు చేస్తుండటం అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను దిగజార్చుతోంది. 1977 అత్యవసర పరిస్థితి కాలంలో నటి స్నేహలతా రెడ్డి, సాంకేతిక విద్యార్థి పి. రాజన్ వంటి వారి ప్రాణాలు బలితీసుకున్న నాటి పోలీసు క్రూరత్వం నేటికీ మారలేదనడానికి ప్రస్తుత సంఘటనలే ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. 1977లో జాతీయ రక్షక భట సంఘం ఏర్పాటైనా, అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినా రక్షక భట సంస్కరణలు నెరవేరకుండా కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి.

ప్రస్తుత మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలను, సామాజిక కార్యకర్తలను, విద్యార్థులను ఏళ్ల తరబడి విచారణ లేకుండా జైళ్లలోనే ఉంచడానికి ఉపయోగిస్తున్న నిరంకుశ చట్టాల మూలాలు గత పాలనలోనే ఉన్నాయి. భీమా కోరేగావ్ నిందితులు, శార్జీల్ ఇమామ్, ఉమర్ ఖలీద్ వంటి వారిపై ఉపయోగిస్తున్న చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం, జాతీయ భద్రతా చట్టం, సమాచార సాంకేతిక చట్టంలోని వివాదాస్పద విభాగాలు, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం వంటి వాటిని గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు తమ ప్రయోజనాల కోసం తెచ్చినవేనన్నది చేదు నిజం. నేడు పాలక ప్రభుత్వం ఆ చట్టాల పదును పెంచి పౌర హక్కులను, విమర్శకుల గొంతులను మరింతగా కాలరాస్తోంది. ప్రజాస్వామ్యాన్ని మరియు దేశ భద్రతను రక్షించడానికని తెచ్చిన చట్టాలే నేడు పౌరుల ప్రాథమిక హక్కులను తొక్కిపెట్టే ఆయుధాలుగా మారడం ఒక చారిత్రక నిర్లజ్జయం. గతాన్ని సరిదిద్దుకుని, తమ హయాంలో చేసిన పొరపాట్లను అంగీకరించి ప్రాయశ్చిత్తం చేసుకున్నప్పుడే విపక్షాలకు ప్రజాస్వామ్య వ్యవస్థను పునరుద్ధరించే నైతిక హక్కు దక్కుతుంది.అదే సమయంలో, దేశ రాజధాని ఢిల్లీ వీధుల్లో జరుగుతున్న నిరసనలు, తిరుగుబాట్లు నూతన రాజకీయ చైతన్యానికి సంకేతంగా నిలుస్తున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల ఆక్రోశం, అంతర్జాల మాధ్యమాల్లో పొంగిపొర్లుతున్న యువత ఆగ్రహం వ్యవస్థాగత మార్పును గట్టిగా కోరుకుంటున్నాయి. దేశంలో ప్రధానమైన ప్రదేశంలో 'త్రివర్ణ పతాక ప్రదర్శన'కు అనుమతి నిరాకరించడం, చేతిలో జాతీయ జెండాను చేతబూనిన వారిని కూడా అనుమానించడం చూస్తుంటే, అసలు పౌరుడు దేశభక్తుడో కాదో నిర్ణయించే హక్కు ఎవరికి ఉందనే ప్రశ్న ప్రతి ఒక్కరిలో తలెత్తుతోంది. ప్రభుత్వం ప్రజల దృష్టిని ఈ ఆందోళనల నుంచి మళ్లించడానికి ఎంత ప్రయత్నించినా, వీధుల్లో వ్యక్తమవుతున్న నిరసన జ్వాలల కాకను కప్పిపుచ్చడం ఏమాత్రం సాధ్యం కావడం లేదు. విదేశాంగ దౌత్యం, అంతర్జాతీయ చమురు ఒప్పందాల మెరుపుల వెనుక దేశీయంగా చెలరేగుతున్న తీవ్ర అసంతృప్తిని కప్పిపుచ్చడం సులభం కాదు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పర్యటనలు, పారిశ్రామిక దిగ్గజాల వ్యాపార వ్యూహాలు ప్రభుత్వానికి కొంత ఊరటనిచ్చినప్పటికీ, స్వదేశంలో మండుతున్న నిరుద్యోగం, అణచివేత సమస్యలకు అవి ఏమాత్రం పరిష్కారం చూపలేవు. విదేశాల్లో భారత్ తన బలాన్ని, ప్రభావాన్ని చాటుకోవాలంటే ముందుగా స్వదేశంలో ఉత్పన్నమవుతున్న రాజకీయ అలజడులను కారుణ్యంతో, రాజ్యాంగబద్ధంగా పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికార బలగాలతో, అణచివేత చర్యలతో నిరసనలను తాత్కాలికంగా ఆపవచ్చేమో కానీ, పౌరుల మనస్సులో రగులుతున్న అసంతృప్తిని చల్లార్చలేరు. రాబోయే రోజుల్లో జరిగే వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు కేవలం సాధారణ అధికార మార్పిడికి మాత్రమే కాకుండా, ఈ నిరంకుశ రాజకీయ సంస్కృతికి ఒక ప్రజా తీర్పుగా మారబోతున్నాయి. ఒకపక్క ప్రతిపక్షాలను ఏకం చేస్తూ రాహుల్ గాంధీ వేస్తున్న వ్యూహాత్మక అడుగులు, మరొకపక్క తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వం ప్రయోగిస్తున్న అధికార బలగాలు – ఈ రెండింటి మధ్య నలిగిపోతున్నది మాత్రం సామాన్య పౌరుడేనని స్పష్టమవుతోంది. అవినీతి, పాతకాలపు రాచరికపు పోకడలతో కూడిన రాజకీయాలకు పూర్తి స్వస్తి పలికి, విశాలమైన మరియు క్షమించే గుణం కలిగిన భారతీయ ఆత్మను పునరుద్ధరించడమే నేటి అత్యంత ప్రధానమైన అవసరం. ఈ అణచివేత తాండవం ముగిసిన తర్వాతే, భారత ప్రజాస్వామ్య పుస్తకంలో ఒక సరికొత్త అధ్యాయం, నూతన ఉషోదయం ప్రారంభమవుతుందని ఆశించవచ్చు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సేవాదళ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ...



వనపర్తి వార్త సంధ్య

సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం నిర్వహిస్తున్న జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జిల్లాలో నిరంతరంగా కొనసాగుతుందని డిసీసీ అధ్యక్షులు శివసేన రెడ్డి అన్నారు . ఇందులో భాగంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణంలో స్థానిక శాసనసభ్యులు మెఘా రెడ్డితో కలిసి జిల్లా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సేవాదళ్ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ నాయకుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నెలా చివరి ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా పార్టీ కార్యకర్తల్లో క్రమశిక్షణ, ఐక్యత, సేవాభావం పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షులు గౌర్ల జానకి రాములు, శ్రీను, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, పలు మండల అధ్యక్షులు నరహరి, రామ్ రెడ్డి, సుల్తాన్, సుఖేందర్ రెడ్డి, కోళ్ల వెంకటేష్, బి. కృష్ణ, ఏస్సీ డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు రాజ్ కుమార్, యాదగిరి, మన్యం, పాండు సాగర్, అనిల్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

రామాయంపేట, వార్త సంధ్య

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ సైదా గారు మరియు సర్కిల్ సిబ్బంది ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్ రామాయంపేట సర్కిల్ ఆఫీస్ లోని ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో నిర్వహించబడుతుంది. మెదక్ జిల్లాకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఈరోజు సాయంత్రం లోగా తమ టీమ్ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ టోర్నమెంట్ లో కేవలం డబుల్స్ మాత్రమే నిర్వహించబడుతుంది. ఎటువంటి ఎంట్రీ రుసుము లేదు ఈ టోర్నమెంట్ ఈ నెల 26 మరియు 27వ తేదీలలో సాయంత్రం 6 గంటల నుండి రాత్రి వరకు కొనసాగుతుంది. పేర్లు నమోదు చేసుకోవాలనుకునే వారు ఈ క్రింది సంబర్లకు ఫోన్ చేసి సంప్రదించగలరు: 9573824746, 9985959400, 8555853619.

హైదరాబాద్‌లో నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్

-కొప్పుల పరమేశ్వరి -- జంగయ్య దంపతుల చిన్నారులకు శు భాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే



దేవరకొండ వార్త సంధ్య

కొప్పుల పరమేశ్వరి -- జంగయ్య దంపతుల చిన్నారులు వర్షిత, అదితి, రోహన్ కృష్ణల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన శుభకార్యంలో దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ప్రమిద కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఈ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ శుభకార్యంలో కుటుంబ సభ్యులతో కలిసి కొంతసేపు ముచ్చటించి, వేడుకలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో జాటావత్ హరి నాయక్, కొండూరు పవన్ కుమార్, మునుకుంట్ల శేఖర్, నేనావత్ వసంత్ నాయక్, నేనావత్ జవహర్ లాల్, గౌని జంగయ్య, దుబ్బాకుల మదార్, కొప్పుల అశోక్ గౌడ్, కోటిదొడ్డి శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంభాలా 360 సొల్యూషన్స్ ప్రారంభోత్సవం





హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 25.

సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు రాజకీయ, సినీ, పరిశోధన, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఈరోజు శంభాలా 360 సొల్యూషన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పొంగులేటి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రత్యేక అతిథులుగా ప్రముఖ సినీ నటీమణులు శ్రీమతి చల్లా జయలలిత, శ్రీమతి మంజు భార్గవి, ప్రముఖ సినీ నటుడు శివకృష్ణ, సినీ దర్శకుడు ఎన్. శంకర్, నారీ శక్తి ఫోరం వ్యవస్థాపకులు డాక్టర్ మొహమ్మద్ నిజాముద్దీన్, డాక్టర్ వెంకట కె. గంజాం (జీకే) పాల్గొన్నారు. చైతన్య పరిశోధకులు, ఎనర్జీ సైంటిస్ట్ డాక్టర్ కె. హరి హర నాధ రాజు, వీశం సాయిదేవ్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించి, శంభాలా 360 సొల్యూషన్స్ లక్ష్యాలు, ఆశయాలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా పలు నూతన ఉత్పత్తులు, ప్రచురణలు, డిజిటల్ సేవలను ప్రారంభించారు. ముఖ్యంగా శంభాలా ఆస్ట్రో -- (పల్స్ ఎలక్ట్రోమాగ్నెటిక్ ఫీల్డ్) చైతన్య ఫ్రీక్వెన్సీ పరికరం, శంభాలా పిల్లో, సీట్ మ్యాట్రెస్, శంభాలా భగవద్గీత మహాగ్రంథం మరో ఎనిమిది మహాగ్రంథాలు, శంభాలా ఆహార ఉత్పత్తులు, ఆండ్రాయిడ్ ఐఓఎస్ ప్లాట్‌ఫారమ్‌ల కోసం రూపొందించిన శంభాలా 360 సొల్యూషన్స్ మొబైల్ అప్లికేషన్ ప్రారంభించబడ్డాయి. చైతన్య పరిశోధన, ఎనర్జీ సైన్స్, ఆధ్యాత్మిక సాహిత్యం, వినియోగదారుల ఉత్పత్తులు, డిజిటల్ సేవలను ఒకే వేదికపైకి తీసుకురావడమే శంభాలా 360 సొల్యూషన్స్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ అతిథులు సంస్థ బృందానికి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పరిశోధన, విజ్ఞాన వ్యాప్తి, నూతన ఆవిష్కరణల ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను విస్తృతం చేసే దిశగా శంభాలా 360 సొల్యూషన్స్ ప్రారంభోత్సవం ఒక ముఖ్యమైన ముందడుగు అని నిర్వాహకులు పేర్కొన్నారు.

పోల్కెపాడు గ్రామంలో గుట్టు చప్పుడు కాకుండా గుట్టలు మాయం





-సొంత పొలాలలో అంటూ,అనుమతి లేకుండా ప్రభుత్వ గుట్టలను తొవ్వుతున్న కొందరు దళారులు

-ప్రకృతికి తీరని నష్టం..

-అనుమతులు ఉన్నాయా?

-అధికారులు ఏం చేస్తున్నారు?

వార్త సంధ్య :వనపర్తి జిల్లా, గోపాల్ పేట్ అక్టోబర్ (25)

వనపర్తి జిల్లా గోపాల్ పేట్ మండలం పోల్కెపాడు గ్రామంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గ్రామ పరిధిలో ఉన్న చిన్న చిన్న గుట్టలు,మాల గుట్ట బాపనోని గుట్ట,ప్రభుత్వ భూములు రాత్రికి రాత్రే మాయమవుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు దళారులు,స్థానికంగా పట్టా భూములు ఉన్నాయనే నెపంతో పక్కనే ఉన్న ప్రభుత్వ గుట్టలను సైతం తొవ్వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లిఏం జరుగుతోంది అక్కడ?లిసమాచారం ప్రకారం, పోల్కెపాడు గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ గుట్టల వద్ద గత కొన్ని నెలలుగా జెసిబిలు, టిప్పర్లు నిరంతరం తిరుగుతున్నాయి. సొంత పొలంలో మట్టి తీస్తున్నామని చెప్పి,అడ్డుగా ఉన్న గుట్ట మొత్తాన్ని తోడేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒక్కో టిప్పర్ మట్టి,మొరం, గ్రావెల్ ను రూ. 3,000 నుండి రూ. 5,000 వరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం.

అనుమతులు ఉన్నాయా?

ఖనిజ శాఖ నిబంధనల ప్రకారం, ఏదైనా గుట్టను తవ్వాలన్నా, మట్టిని తరలించాలన్నా మండల తహసీల్దార్, మైనింగ్ అధికారి, పర్యావరణ అనుమతులు తప్పనిసరి. కానీ పోల్కెపాడులో జరుగుతున్న తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని తెలుస్తోంది. పట్టా భూమిలో తవ్వకాలకు కూడా కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే పరిమిత అనుమతి ఉంటుంది. కానీ ఇక్కడ వాణిజ్య అవసరాల కోసం అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

ప్రకృతికి తీరని నష్టం..

ఇలా గుట్టలను తవ్వడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. వర్షపు నీటిని ఒడిసిపట్టే గుట్టలు లేకపోతే గ్రామంలో నీటి ఎద్దడి తప్పదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా, భారీ వాహనాలతో గ్రామ రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయి, దుమ్ము ధూళితో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.లి

అధికారులు ఏం చేస్తున్నారు?


ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ మరియు మైనింగ్ అధికారులు స్పందించి, వెంటనే విచారణ జరిపి, అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతి లేకుండా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం తవ్వకాలు ఆగడం లేదనే విమర్శలు ఉన్నాయి ఈ అక్రమ తవ్వకాల వెనుక ఎవరున్నారు? ఎవరి అండదండలతో ఈ దందా సాగుతోంది? అధికారులు తక్షణమే సర్వే చేసి, ప్రభుత్వ భూములను కాపాడాలని, అక్రమార్కులపై కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో డీఎన్‌టీ కులాలకు ప్రాధాన్యమివ్వాలి

-తెలంగాణలో ఆరు స్థానాల్లో కనీసం రెండు కేటాయించాలని డిమాండ్

హైదరాబాద్, (వార్త సంధ్య)అక్టోబర్ 25.

: ప్రత్యక్ష ఎన్నికల్లో ఆధిపత్య కులాల ఆర్థిక, అంగబలంతో పోటీ పడలేకపోతున్న డీనోటిఫైడ్ ట్రైబ్స్(డీఎన్‌టీ) వర్గాలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవులు కల్పించాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. తెలంగాణలో గవర్నర్ కోటా కింద భర్తీ చేసే ఆరు ఎమ్మెల్సీ స్థానాల్లో కనీసం రెండు స్థానాలను అత్యంత వెనుకబడిన డీఎన్‌టీ కులాలకు కేటాయించాలని కోరుతున్నారు. మేదరి, యెరుకుల, బుడగజంగం, గంగిరెద్దుల, పూసల వంటి కులాలు ఆర్థికంగా, సామాజికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఇల్లు, భూమి వంటి కనీస వనరులు కూడా లేని కుటుంబాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో భారీగా ఖర్చు చేయాల్సి వస్తుండటంతో ఈ వర్గాలకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం కష్టసాధ్యంగా మారిందని అభిప్రాయపడుతున్నారు.



రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా కళలు, సాహిత్యం, సామాజిక సేవ, సహకార రంగాల్లో ప్రత్యేక అనుభవం, సేవలు కలిగినవారికి శాసనమండలిలో ప్రాతినిధ్యం కల్పించే అవకాశాలను వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగించాలని కోరుతున్నారు. తెలంగాణలో బీసీ-ఏ జాబితాలో ఉన్న మేదరి కులానికి గత 70 ఏళ్లలో ఎమ్మెల్సీ లేదా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం దక్కలేదని, ఇదే తరహా పరిస్థితులు ఇతర డీఎన్‌టీ కులాల్లోనూ ఉన్నాయని ఆ వర్గాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

రెండు స్థానాలు కేటాయించాలని విజ్ఞప్తి...

గవర్నర్ కోటాలోని ఆరు ఎమ్మెల్సీ స్థానాల్లో కనీసం రెండింటిని డీఎన్‌టీ వర్గాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక స్థానాన్ని మేదరి, గంగిరెద్దుల, బుడగజంగం, పూసల, యెరుకుల వంటి అత్యంత వెనుకబడిన కులాలకు, మరో స్థానాన్ని సంచార జాతుల మహిళలకు కల్పించాలని కోరుతున్నారు. డీఎన్‌టీ వర్గాలకు శాసనమండలిలో ప్రాతినిధ్యం లభిస్తేనే తమ జీవన సమస్యలు, ఉపాధి కష్టాలు, ఆకలి, ఆత్మగౌరవం, సామాజిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను చట్టసభల్లో ప్రస్తావించే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలతో కల్పించే అవకాశం కాదని, సమానత్వం, సామాజిక న్యాయం దిశగా తీసుకోవాల్సిన చర్యగా పరిగణించాలని డీఎన్‌టీ వర్గాల ప్రతినిధులు కోరుతున్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

రూ.1 సిమ్‌తో బీఎస్ఎన్ఎల్ బంపరాఫర్

రోజుకు 1 జీబీ డాటా అపరిమిత వాయిస్ కాల్స్ ఉచితం



న్యూఢిల్లీ:వార్త సంధ్య

ప్రైవేట్ నెట్‌వర్క్‌లు ఇటీవల రీచార్జ్ ధరలను భారీగా పెంచడంతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులకు ప్రభుత్వ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ శుభవార్త చెప్పింది. 'ఫ్రీడమ్ 2.0' ఆఫర్ పేరిట కేవలం ఒక్క రూపాయికే సిమ్ అందిస్తున్నది. ఇందులో 24 రోజుల పాటు ప్రతి రోజూ 1 జీబీ డాటా, అపరిమిత వాయిస్ కాల్స్, 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా లభిస్తాయి. ఈ ఏడాది నవంబర్ 9 వరకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఈ ఆఫర్ కేవలం కొత్త వినియోగదార్లకు మాత్రమేనని, ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ సిమ్‌ను వాడుతున్న పాత వినియోగదారులకు వర్తించదని అధికారులు చెప్పారు

సర్' సాఫ్ట్‌వేర్‌ను వెల్లడించలేం అది వ్యాపార రహస్యం: ఈసీ



న్యూఢిల్లీ:వార్త సంధ్య

ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో లోటుపాట్లను గుర్తించేందుకు వాడిన సాఫ్ట్‌వేర్ వివరాలను వెల్లడించడానికి కేంద్ర ఎన్నికల సంఘం నిరాకరించింది. హిందూస్థాన్ టైమ్స్ నివేదిక ప్రకారం.. 'ఈ సమాచారం వ్యాపార రహస్యానికి, మేధో సంపదకు సంబంధించినది.దీన్ని సమాచార హక్కు చట్టం కింద బహిర్గతం చేయలేం' అని ఈసీ పేర్కొంది. ఓటర్ల జాబితాలో వ్యత్యాసాలను గుర్తించడానికి కృత్రిమ మేధ లేదా మెషీన్ లెర్నింగ్ ఉపయోగిస్తున్నారా లేదా అనే విషయాన్ని ఈసీ స్పష్టం చేయలేదు. సాఫ్ట్‌వేర్ సొంతంగా తప్పులను గుర్తిస్తుందా అనే ప్రశ్న స్పష్టతను కోరేదని పేర్కొంటూ దానికి సమాధానాన్ని నిరాకరించింది.

సాఫ్ట్‌వేర్‌పై ఈసీ సమాచారాన్ని దాస్తున్నది: కాంగ్రెస్

ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని ఎన్నికల సంఘం దాచి పెట్టిందని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ ఆదివారం ఆరోపించారు. హిందూస్థాన్ టైమ్స్ రిపోర్ట్‌ను ప్రస్తావిస్తూ పారదర్శకత లోపించడం, కృత్రిమ మేధను ఉపయోగించడం వల్ల 'సర్' ప్రక్రియ విశ్వసనీయత దెబ్బతిన్నదని విమర్శించారు.

పెరగనున్న సబ్బులు, వంటనూనెల ధరలు



న్యూఢిల్లీ వార్త సంధ్య

ఇప్పటికే బియ్యం, పప్పులు, గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుతో ఇబ్బంది పడుతున్న సామాన్యుడిపై మరో పిడుగు పడనుంది. త్వరలోనే సబ్బులు, టూత్‌పేస్ట్‌లు, వంటనూనెలు, చాక్లెట్ల వంటి ధరలు పెరగనున్నాయి. క్రూడ్ చమురు ధరలు పెరగడంతో ముడిసరుకుల ధరలు 74 శాతం వరకు పెరగడమే కాక, బలహీనమైన వర్షపాతం నమోదుతో పలు పంట ఉత్పత్తులు తగ్గడంతో ఎఫ్ఎంసీజీ కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను పెంచేందుకు నిర్ణయించాయి.చమురు ధరలు బ్యారెల్‌కు 113 డాలర్లకు చేరడంతో ఉత్పత్తి వ్యయాలపై దాని ప్రభావం గణనీయంగా పడిందని క్రైసిల్, ఎలరా క్యాపిటల్, కొటక్ నియో సంస్థల విశ్లేషకులు పేర్కొన్నారు. డిసెంబర్ నుంచి టెలిఫోన్ బిల్లులు పెరగనున్నట్టు అంబిట్ క్యాపిటల్ అంచనా వేసింది.

ఆలయాల్లో భద్రతకు అమెరికా రూ.100 కోట్ల ప్రణాళిక

ఇల్లినాయిస్ వార్త సంధ్య



అమెరికాలోని ఇల్లినాయిస్‌లో హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడి కుట్ర వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, దీపావళికి ముందుగా అమెరికాలోని హిందూ దేవాలయాలు, మతపరమైన సంస్థల భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 500 దేవాలయాల భద్రత కోసం రూ.100 కోట్లు కేటాయించినట్లు సమాచారం.ఈ భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఆలయ ప్రాంగణాలను నిరంతరం పర్యవేక్షించేందుకు కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, నిఘా అలారంలను సమకూర్చనున్నారు. అత్యధిక సంఖ్యలో ప్రజలు వచ్చే దేవాలయాల వద్ద శిక్షణ పొందిన, లైసెన్సులు కలిగిన సాయుధ గార్డులను నియమించనున్నారు.

జెన్-జీకి ఎమ్మెస్ ధోని సూచన..

- అలాంటి అలవాట్లతో ఆరోగ్యం పాడవుతుందంటూ ఆందోళన



న్యూఢిల్లీ వార్త సంధ్య

: జెన్-జీ ఆహారపు అలవాట్లు, జీవనశైలిపై భారత మాజీ క్రికెటర్ ఎమ్మెస్ ధోని ఆందోళన వ్యక్తం చేశారు. వీటివల్ల దీర్ఘకాలికంగా వారి ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉందన్నారు. తాజాగా ఒక కార్యక్రమంలో ప్రముఖ రచయిత జావేద్ అక్తర్‌తో కలిసి ధోని పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెన్-జీకి కీలక సూచన చేశారు. జెన్-జీ, జెన్-ఆల్ఫా పాటిస్తున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలితో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. వారి ఆహారపు అలవాట్లు ఆందోళనకరంగా ఉన్నాయని, మార్చుకోవాలని సూచించారు.అలాగే, శారీరక శ్రమ, మంచి ఆహారంపై దృష్టి సారించాలన్నారు. అయితే, ఇప్పటి తరంలో కొందరు గతంకంటే మెరుగైన సామాజిక, నైతిక విలువలు పాటిస్తున్నారని, ఇది హర్షణీయం అన్నారు. అలాగే, పెద్దలు కూడా ఎప్పుడూ తామే సరైన వాళ్లం అనుకోకుండా, కొత్త తరం నుంచి కూడా నేర్చుకోవడానికి ప్రయత్నించాలని సలహా ఇచ్చారు. భారతీయులు ఎక్కువగా కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం తీసుకుంటారనే విషయంపై కూడా ధోని మాట్లాడారు. భారతీయుల జీవనశైలి, శారీరక శ్రమ కారణంగా కార్బోహైడ్రేట్లు ఎక్కువగా తీసుకోవాల్సి వచ్చిందన్నారు.ప్రస్తుతం మారిన రోజువారీ జీవనశైలి, ఎక్కువగా యాక్టివ్‌గా లేకపోవడం, ఒకేరకమైన ఆహారం తీసుకోవడం వంటివి ఇప్పుడు చాలా మందికి సరిపోకపోవచ్చు అన్నారు. ఆహారపు అలవాట్లు ప్రాంతాన్నిబట్టి వేరుగా ఉంటాయని, అందరికీ ఒకే రకమైన ఆహారం సరిపోదని ధోని అన్నారు. నేటి కాలంలో చాలా మంది శారీరక శ్రమకు దూరంగా ఉంటున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లి ఉబర్ కార్ లేదా ఆటో ఎక్కుతున్నారు. కూర్చుని వెళ్లి, కూర్చుని పని చేస్తున్నారు. దీంతో శారీరక శ్రమ తగ్గుతూ వస్తోంది. ఇప్పుడు ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి కూడా పెరిగిపోయింది. చక్కెర ఉండే ఫుడ్, ఫ్రైడ్ ఫుడ్ ఇలా మార్కెట్లో దొరుకుతోంది. అయితే, శారీరక శ్రమ తక్కువగా ఉండేవారికి ఇలాంటి ఆహారం సరిపోదు అంటూ ధోని వ్యాఖ్యానించారు.

'మన్ కీ బాత్' కు 12 ఏళ్లు పూర్తి..

-అదొక తీర్థయాత్ర లాంటిదన్న ప్రధాని మోదీ..!



న్యూఢిల్లీ వార్త సంధ్య

నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్ పన్నెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ తన అనుభవాలను పంచుకున్నారు. ఈ ప్రయాణం తనకు ఒక 'తీర్థయాత్ర ' లాంటిదని, దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సామాన్యులు చేస్తున్న అసాధారణమైన కృషిని గౌరవించుకునే మార్గమని అన్నారు. 'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. ఈ ప్రయాణంలో తనకు తోడుగా నిలిచి స్ఫూర్తినిచ్చిన శ్రోతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.పన్నెండేళ్ల క్రితం విజయదశమి పర్వదినాన మనం 'మన్ కీ బాత్' ప్రారంభించామని, అప్పటి నుంచి మన ప్రయాణం నిరంతరాయంగా కొనసాగుతోందని ప్రధాని గుర్తుచేశారు. ఈ ప్రయాణంలో మీరంతా సహ ప్రయాణికులుగా, స్ఫూర్తిదాతలుగా ఉన్నారని శ్రోతలను ఉద్దేశించి అన్నారు. శతాబ్దాలుగా మన దేశంలో తీర్థయాత్రల సంప్రదాయం ఉందని, దేశ ప్రజల కృషిని దగ్గర నుంచి అర్థం చేసుకోవడానికి, వారి సేవలకు వందనం చేయడానికి 'మన్ కీ బాత్' తనకు ఒక తీర్థయాత్ర కన్నా తక్కువేమీ కాదని చెప్పారు. సమాజం కోసం, దేశం కోసం జీవించే వ్యక్తులు స్వయంగా పుణ్యక్షేత్రాల వంటివారని ప్రధాని కొనియాడారు. దేశంలోని సామాన్య ప్రజల కృషినీ, ధైర్యాన్ని, అంకితభావాన్ని, సేవా స్ఫూర్తిని చాటిచెప్పేందుకు 'మన్ కీ బాత్' ఒక అద్భుతమైన అవకాశమని ప్రధాని అన్నారు. ఈ పన్నెండేళ్లలో సమాజం దృష్టికి రాని ఎందరో మహానుభావుల అసాధారణమైన పనులను ఈ కార్యక్రమం ద్వారా దేశం ముందుంచామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం ద్వారా తాను ఒకరకంగా మన దేశ ప్రజల శక్తికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. దేశంలోని ప్రతి కుటుంబంతోనూ అనుబంధం పెంచుకునే అవకాశం నాకు లభించిందని చెప్పారు. చాలామంది ప్రజలు తనకు సందేశాలు పంపుతూ.. 'మన్ కీ బాత్' వింటున్నప్పుడు, తమ మధ్యలో ఒక కుటుంబసభ్యుడిగా కూర్చుని మాట్లాడుతున్నట్లు అనిపిస్తుందని చెబుతుంటారని మోదీ ఆనందం వ్యక్తంచేశారు. "శ్రోతలైన మీ అందరి ఆత్మీయత, అనురాగం నాకు నిజంగా అమూల్యమైన ఆస్తి" అని ప్రధాని భావోద్వేగంగా అన్నారు. తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమం 2014 అక్టోబర్ 3న విజయదశమి రోజున ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్‌లలో ప్రసారమైంది. అప్పటి నుంచి ప్రతి నెల చివరి ఆదివారం ఈ కార్యక్రమం కొనసాగుతూ వచ్చింది.

సౌదీ అరేబియాపై డ్రోన్లు, మిస్సైల్స్ దాడి.

-ఆ వీడియోలు షేర్ చేయొద్దంటూ భారతీయులకు వార్నింగ్



న్యూఢిల్లీ వార్త సంధ్య

: సౌదీ అరేబియాపై హౌతీ ఉగ్రవాదులు వరుసగా దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. వివిధ రకాల డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులకు దిగుతుంది. అయితే, ఈ దాడులకు సంబంధించిన వీడియోలు షేర్ చేయొద్దని సౌదీ అరేబియా ప్రభుత్వం సూచించింది. సౌదీలో ఉంటున్న భారతీయులు ఈ ఆదేశాన్ని పాటించాలని సూచించింది. ఇండియాతోపాటు ఇతర దేశాల ప్రజలు కూడా ఇదే సూచన చేసింది. వివిధ ఈ మేరకు ఎక్స్ వేదికగా సౌదీ ప్రభుత్వం ప్రకటించింది.దీన్ని సౌదీలోని భారత రాయబార కార్యాలయం రీట్వీట్ చేసింది. సౌదీలో ఉంటున్న భారతీయులు ఈ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించింది. ఈ సూచనల ప్రకారం.. సౌదీ అరేబియాలోని వివిధ ఎయిర్‌పోర్టులు, చమురు క్షేత్రాలపై హౌతీలు దాడులు చేస్తున్నారు. డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడికి పాల్పడుతున్నారు. అయితే, వీటిలో కొన్నింటిని సౌదీ రక్షణ విభాగం అడ్డుకుంటోంది. హౌతీల దాడులు.. పలు భవనాలు ధ్వంసం కావడం.. కొన్నింటిని సౌదీ అడ్డుకుని గాలిలోనే పేల్చేయడం వంటివి జరుగుతున్నాయి.వీటన్నింటిని అక్కడ ఉన్న స్థానికులు తమ సెల్‌ఫోన్లలో వీడియోలు తీస్తున్నారు. వాటిని సోషల్ మీడియా, వాట్సాప్‌లలో షేర్ చేస్తున్నారు. ఈ అంశంపైనే సౌదీ స్పందించింది. భారతీయులు సహా తమ దేశంలో ఉంటున్న వారెవరూ వాటిని వీడియో తీయొద్దని, షేర్ చేయవద్దని సూచించింది. ఈ నిబంధన అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. హౌతీల దాడుల నేపథ్యంలో రియాద్, దమ్మామ్ సహా పలు ఎయిర్‌పోర్టుల నుంచి విమానయాన సేవల్నినిలిపివేస్తున్నట్లు సౌదీ ప్రకటించింది. నవంబర్ 7 వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని ప్రకటించింది.

ఏఐ దెబ్బ.. 'గెట్టి ఇమేజెస్' దివాలా

4.8 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరి



న్యూఢిల్లీ వార్త సంధ్య

: ఏఐ ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో చెప్పే ఘటన ఇది. ఏఐ రాక ముందు ఫొటోగ్రఫీ ప్రపంచాన్ని దశాబ్దాల పాటు ఏలిన గెట్టి ఇమేజెస్ కంపెనీ దివాలా తీసింది. దాదాపు 4.8 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన ఈ కంపెనీ.. ఇప్పుడు అప్పులభారంతో దివాలా తీసేదాకా వచ్చింది. ఒకప్పుడు ప్రింట్ మీడియా, డిజిటల్, న్యూస్ పోర్టల్ ఇలా అనేక రంగాలకు తమ ఫొటోలను అందించింది ఈ సంస్థ. కానీ ఏఐ వచ్చిన తర్వాత అన్ని రంగాలు ఫొటోలను తామే జనరేట్ చేసుకుంటున్నాయి. జెట్టి పెయిడ్ ఫొటోలను ఎవరూ వాడకపోవడంతో నష్టాలు తలెత్తాయి.

నర్మద ఒడ్డున వేలాది ఓటరు కార్డులు

విచారణకు విపక్షం డిమాండ్



భోపాల్:వార్త సంధ్య

మధ్యప్రదేశ్‌లోని నర్మదా నది ఒడ్డున వేలాది ఓటరు ఐడీ కార్డులు పడి ఉండటం రాజకీయంగా సంచలనం సృష్టించింది. ఖర్గోన్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని విపక్ష కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మండలేశ్వర్‌లో నిస్వార్థ సేవా సమితి సభ్యులు ఒక ఘాట్‌ను శుభ్రం చేస్తుండగా అక్కడ వేలాది ఓటరు ఐడీ కార్డులు ఉండటాన్ని గమనించారు. వెంటనే వారు అధికారులకు ఫిర్యాదు చేశారు.

మోదీ నాన్న కూడా వెళ్లాల్సిందే

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు.. అమిత్ షా అభ్యంతరం



పాట్నా, వార్త సంధ్య

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహనం కోల్పోయి ప్రధాని నరేంద్ర మోదీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీహార్‌లోని పాట్నాలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ప్రధానిపై విమర్శలు చేస్తున్న క్రమంలో 'మోదీ ఎక్కడికీ వెళ్లబోరు' అంటూ సభికుల్లో ఒకరు చేసిన వ్యాఖ్యలపై ఖర్గే సహనం కోల్పోయారు. 'మోదీయే కాదు ఆయన బాబు (తండ్రి) కూడా వెళ్లాల్సిందే' అంటూ ఆయన ప్రతిస్పందించిన తీరు ఇప్పుడు వివాదానికి దారితీసింది.నల్లధనాన్ని వెనక్కి తెస్తానంటూ మోదీ చేసిన వాగ్దానంపై, ఆయన అనుసరిస్తున్న ఆర్ఎస్ఎస్ భావజాలంపై తీవ్రంగా విమర్శలు చేసిన ఖర్గే.. మోదీ ప్రధానిగా కొనసాగినంత కాలం దేశంలో శాంతి ఉండదని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగానికి విరుద్ధ అభిప్రాయాలు కలిగి ఉన్నాయని విమర్శించారు. సోషలిస్ట్ సిద్ధాంతంతో ఏర్పడిన జనతా దళ్ (యునైటెడ్) పార్టీని ఎన్డీఏ కూటమిలో చేర్చడం ద్వారా ఆ భావజాలానికి బీహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్ నీళ్లు వదిలారని అన్నారు. ఖర్గే వ్యాఖ్యలను హోం మంత్రి అమిత్ షా తప్పుబట్టారు. ప్రధాని దివంగత తండ్రి గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం ద్వారా ఖర్గే మర్యాద హద్దులన్నింటినీ దాటేశారని విమర్శించారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com



మెగా ఫ్యాన్స్‌కు అదిరిపోయే అప్‌డేట్..

-ఆర్‌సీ 17 పూజా కార్యక్రమాలు ఎప్పుడంటే?



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మరియు క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న ప్రాజెక్ట్ RC 17'. ఇండస్ట్రీలో సంచలనాత్మక విజయాలను నమోదు చేసిన 'రంగస్థలం' చిత్రం తర్వాత ఈ క్రేజీ కాంబో మరోసారి రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందా అని మెగా అభిమానులు మరియు సినీ ప్రియులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న తరుణంలో, ఎట్టకేలకు మేకర్స్ నుంచి మోస్ట్ ఎవైటెడ్ అఫీషియల్ అప్‌డేట్ వచ్చేసింది.ఈ భారీ ప్రాజెక్ట్‌ను మొదటగా దసరా పండుగ రోజునే అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో లాంచ్ చేయాలని చిత్ర యూనిట్ భావించింది. అయితే ఆ సమయంలో ముహూర్తం సరిపడకపోవడం మరియు కొన్ని సాంప్రదాయ కారణాలరీత్యా ఈ ఓపెనింగ్ కార్యక్రమాన్ని కొద్దిరోజులు వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత అక్టోబర్ చివరి వారంలో ఈ సినిమా లాంఛింగ్ ఉంటుందని మైత్రీ మూవీ మేకర్స్ సహ నిర్మాత వై.రవిశంకర్ గతంలో హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే.
తాజాగా జరిగిన ఒక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ఖచ్చితమైన తేదీని అధికారికంగా రివీల్ చేశారు. వచ్చే నెల నవంబర్ 1వ తేదీన ఎంతో గ్రాండ్‌గా '=జ 17' పూజా కార్యక్రమాలను నిర్వహించి ఈ చిత్రాన్ని అధికారికంగా లాంచ్ చేయబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కేవలం పూజతో సరిపెట్టకుండా, లాంఛింగ్ పూర్తయిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రెగ్యులర్ షూటింగ్ పనులను కూడా శరవేగంగా ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. సుకుమార్ మార్క్ మేకింగ్, రామ్‌చరణ్ గ్లోబల్ ఇమేజ్ తోడవుతుండటంతో ఈ సినిమా ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు కావడంతో మెగా అభిమానులు ప్రస్తుతం ఫుల్ ఖుష్ అవుతున్నారు మరియు సోషల్ మీడియాలో ఈ అప్‌డేట్‌ను ట్రెండ్ చేస్తున్నారు.

నితిన్ 'అలియాస్ రుక్మిణి' నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్!



నేచురల్ స్టార్ నాని సమర్పణలో టాలెంటెడ్ హీరో నితిన్ నటిస్తున్న తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి'. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ఫీల్ గుడ్ ఫ్యామిలీ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ నుంచి తాజాగా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో కృష్ణ పాత్రలో నటిస్తున్న నితిన్, రుక్కుతో ప్రేమలో పడే నేపథ్యంలో సాగే సుందరమైన రొమాంటిక్ గీతం 'రుక్కు రుక్కు రుక్మిణి' ఫస్ట్ సింగిల్‌ను అక్టోబర్ 27న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది.ఈ చిత్రంలో నితిన్ సరసన ఆఫియా సయ్యద్ నాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. యానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి గంటా ఈ సినిమాను నిర్మిస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు మరియు జోమన్ టి. జాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ సినిమా డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

విజయ్ నా లక్కీఛార్మ్!

సినీరంగంలో కొన్ని కాంబినేషన్స్‌కు మంచి క్రేజ్ ఉంటుంది. అలాంటి వాటిలో దళపతి విజయ్-సమంత కాంబో ఒకటి. వీరిద్దరూ కలిసి కత్తి, తెరి, మెర్సల్ చిత్రాల్లో నటించారు. ఈ మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాల్ని సాధించాయి. దీంతో ఈ జంటను సూపర్‌హిట్ జోడీ అని పిలుస్తుంటారు. తాజాగా ఈ విషయమై సమంత ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం తమిళంలో 'సెలబ్రిటీ మాస్టర్ చెఫ్' షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నది సమంత.ఈ సందర్భంగా ఓ ఎపిసోడ్‌లో విజయ్ గురించి సమంత మాట్లాడింది. విజయ్‌తో తాను కలిసి నటించిన మూడు చిత్రాలు హిట్ కావడంతో ఆయన తన లక్కీఛార్మ్‌గా భావిస్తానని సమంత పేర్కొన్నది. సినిమాల్లో అగ్రస్థానంలో ఉన్న సమయంలోనే విజయ్ నటనకు స్వస్తి చెప్పి రాజకీయాల్లో రాణించడం సాధారణ విషయం కాదని అభిప్రాయపడింది. వ్యక్తిగా విజయ్ కోట్ల మందికి స్ఫూర్తినిచ్చారని, నాయకుడిగా కూడా ఆయన ఎంతో కష్టపడుతున్నారని సమంత ప్రశంసలు కురిపించింది.


ఓటీటీలోకి విజయ్ సేతుపతి సూపర్ హిట్ మూవీ 'బత్తా'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



కోలీవుడ్ స్టార్ హీరో, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటించిన లేటెస్ట్ యాక్షన్ కామెడీ డ్రామా మూవీ 'బత్తా' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు బాలాజీ తరణీతరణ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో విజయ్ సేతుపతి నటనకు, విభిన్నమైన కథాంశానికి థియేటర్లలో అద్భుతమైన ప్రశంసలు దక్కాయి.1980ల నాటి మద్రాస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ కామెడీ ఎంటర్టైనర్‌లో లిజోమోల్ జోస్, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు లాక్ అయింది. అక్టోబర్ 29, 2026 నుండి తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ మరియు మలయాళ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు, నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.

షారుఖ్ ఖాన్ పుట్టినరోజు కానుక..

-థియేటర్లలోకి 'డిడిఎల్‌జె' రీ-రిలీజ్!



బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ సిద్ధమవుతోంది. షారుఖ్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన కల్ట్ క్లాసిక్ లవ్ స్టోరీ 'దిల్ వాలే దుల్హానియా లే జాయేంగే' చిత్రాన్ని ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా థియేటర్లలో రీ-రిలీజ్ చేయనున్నారు.షేర్ బాగ్, పివిఆర్, ఐనాక్స్ వంటి ప్రముఖ మల్టీప్లెక్స్ చైన్లలో పరిమిత స్క్రీన్‌లలో ఈ సినిమాను ప్రదర్శించనున్నారు. రాజ్ అండ్ సిమ్రాన్ ల మ్యాజికల్ లవ్ స్టోరీని మరోసారి బిగ్ స్క్రీన్‌పై చూసేందుకు అభిమానులు ఎంతగానో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు షారుఖ్ బర్త్‌డే కావడంతో ఆయన నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'కింగ్' టీజర్‌ను కూడా విడుదల చేయనున్నట్లు సమాచారం.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.